RNI-TGBIL/25/A1275
# ప్రజా పిలుపు
ప్రజల గొంతు - ప్రజల కోసం
PEOPLE VOICE
PRAJA PILUPU
RNI:TGTEL/26/A5230

ప్రజా పిలుపు NEWS TV
నిజం మా ధ్యేయం.. ప్రజలే మా బలం
LIVE
WEB TV | MOBILE APP | DIGITAL NEWS

SANGAREDDY సంపుటి (Volume) :01 సంచిక (Issue) :340 ఎడిటర్ :కె విజయ్ కుమార్ పేజీలు : 08, వెల. 2రూ/ ఆదివారం- 09- ఆగస్టు - 2026

### దేశ స్వాతంత్ర్యం కోసం బీజేపీ, చేసిందేంలేదు
## నీతులు మాత్రమే చెబుతుంటారు



- స్వాతంత్ర్య ఉద్యమంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందన్న కాంగ్రెస్ అధ్యక్షుడు
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి భాగస్వామ్యం లేదని ఖర్గే విమర్శ
- రాహుల్ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని ప్రశంస

ఢిల్లి : బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్

## చైనాలో 'క్రమశిక్షణ' కేంద్రాలు.. తల్లిదండ్రుల మాట వినకపోతే నిర్బంధమే!

- చైనాలో మాట వినని పెద్దలైన పిల్లల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలు
- ప్రేమ వ్యవహారాలు, నిద్ర వేళల్లో తేడాల వంటి కారణాలతో బలవంతపు నిర్బంధం
- గతంలో ఇంటర్నెట్ బానిసల కోసం ఉన్న కేంద్రాలు ఇప్పుడు కొత్త రూపంలో వ్యాపారం
- ఒక యువతిని ప్రియుడి నుంచి విడదీసేందుకు బలవంతంగా కేంద్రానికి పంపిన తల్లిదండ్రులు



ఢిల్లి : చైనాలో ఒక వింత, ఆందోళనకరమైన ధోరణి వెలుగులోకి వచ్చింది. పిల్లలు పెద్దయ్యాక తమ మాట వినడం లేదనో, తమకు నచ్చని జీవితాన్ని ఎంచుకున్నారనో భావించే తల్లిదండ్రులు.. తమ సొంత పిల్లలనే బలవంతంగా క్రమశిక్షణ కేంద్రాలకు పంపుతున్నారు. ప్రేమలో పడటం, వీడియో గేమ్‌లు ఎక్కువగా ఆడటం, నచ్చిన ఉద్యోగం చేయడం, సరైన సమయానికి నిద్రపోకపోవడం వంటి కారణాలతో కూడా ఈ కేంద్రాల్లో నిర్బంధిస్తున్నారు. ప్రముఖ ఆన్‌లైన్ మ్యాగజైన్ 'ది డిప్లొమాట్' తన కథనంలో ఈ సంచలన విషయాలను వెల్లడించింది. మిగతా..2లో

## మోదీతో సుఖ్‌బీర్ బాదల్ భేటీ.. పొత్తు పునరుద్ధరణ దిశగా బీజేపీ-శిరోమణి అకాలీదళ్ కసరత్తు

- డీలిమిటేషన్ కు మద్దతు ప్రకటించిన సుఖ్‌బీర్ సింగ్ బాదల్
- గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన శిరోమణి అకాలీదళ్
- ప్రస్తుతం పంజాబ్‌లో మారుతున్న రాజకీయ పరిణామాలు



ఢిల్లి: శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమైన మరుసటి రోజే కీలక రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియకు బాదల్ మద్దతు ప్రకటించారు. దీంతో, పంజాబ్‌లో బీజేపీ - అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తోందనే చర్చలు ఊపందుకున్నాయి. ప్రధానితో జరిగిన భేటీ సానుకూలంగా జరిగిందని, పంజాబ్ అభివృద్ధి, రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా కూటమి పునరుద్ధరణ దిశగా అడుగులు పడుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన అకాలీదళ్, ప్రస్తుతం పంజాబ్‌లో మిగతా..2లో

### కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు



- ముఖ్యమంత్రి రేవంత్‌కు వ్యవసాయంపై అవగాహన శూన్యమన్న కేటీఆర్
- నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధమన్న కేటీఆర్
- 24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించాలని సవాల్
- ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ తీవ్ర పోరాటం చేస్తుందని వెల్లడి

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని

# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు

- సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.
- భూసేకరణ, కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు.
- నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు.



హైదరాబాద్, ఆగస్టు 8 : సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. ఈరోజు (శనివారం) సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. మిగతా..2లో

### దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం



- ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన పెద్ది సుదర్శన్ రెడ్డి
- కుటుంబానికి అండగా నిలిచేందుకు కేసీఆర్ కీలక నిర్ణయం
- పిల్లల చదువు, ఆయన తల్లి బాగోగుల కోసం ఆర్థిక సాయం

హైదరాబాద్: ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పరంగా సుదర్శన్ రెడ్డి కుటుంబానికి మొత్తంగా రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆయన ఇద్దరు పిల్లలకు చెరో రూ. కోటి చొప్పున ఆర్థిక సాయం మిగతా..2లో

## తిరుపతికి మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్.. రూట్ ఫిక్స్ చేసిన రైల్వేశాఖ..



తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు రైల్వేశాఖ మరో శుభవార్త అందించేందుకు సిద్ధమవుతోంది. తిరుపతి మీదుగా ఇప్పటికే పలు వందే భారత్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్న విషయం తెలిసిందే.

తిరుపతి :తిరుమలకు వేగంగా చేరుకునేందుకు ఈ రైళ్లు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అయితే త్వరలో తిరుపతికి మరో వందే భారత్ రైలు వచ్చే అవకాశముంది. తాజాగా ట్రయల్ రన్ కూడా నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల తిరుపతి రైల్వే స్టేషన్‌లో కొత్త వందే భారత్ రైలు కనిపించింది. రైల్వే స్టేషన్‌లోని ఫిట్ లైన్‌పై ఇది ఆగింది. మిగతా..2లో

## ఢిల్లీలో డెంగ్యూ H1N1 కేసులు..



ఢిల్లీ ఆసుపత్రులలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులతో కలిపి ఇప్పటివరకు 1,389 డెంగ్యూ కేసులు నమోదు కాగా ఎ1బీ1 కేసుల సంఖ్య 1,344కు చేరింది. ఈ రెండు ఇన్ఫెక్షన్ల వల్ల ఇప్పటివరకు ఎలాంటి మరణాలు సంభవించలేదు.

దీనికి సంబంధించిన లక్షణాలు, ప్రమాద సంకేతాలు, చికిత్స మరియు నివారణ మార్గాలు ఓసారి పరిశీలిస్తే..

ఢిల్లీ వ్యాప్తంగా ఇప్పటివరకు 1,179 డెంగ్యూ కేసులు నమోదు కాగా, నగరంలోని ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న మరొక 210 మంది రోగులు రాజధాని వెలుపలి ప్రాంతాలకు చెందినవారు. మిగతా..2లో

### కుర్చీ కోసం సొంత పార్టీ కార్యకర్తలనే బలితీసుకుంటున్నారు.. జగన్‌పై మంత్రి సవిత ఫైర్



- రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్నామని మంత్రి సవిత అన్నారు.
- గత ప్రభుత్వంలో నిలిచిపోయిన అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు.

అమరావతి, ఆగస్టు 8: రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్నామని మంత్రి సవిత అన్నారు. ఈరోజు(శనివారం) మీడియాతో మాట్లాడుతూ..

## చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే
# నిజమనుకుంటారు

- టీడీపీ యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం శిక్షణా తరగతులు
- గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కేడర్‌కు చంద్రబాబు పిలుపు
- ప్రభుత్వ పథకాలు, మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచన
- డీఎస్సీపై ప్రతిపక్షం చేసిన దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొన్నామని వెల్లడి
- పార్టీలో క్రమశిక్షణ తప్పితే జీరో టాలరెన్స్ విధానం ఉంటుందని హెచ్చరిక
- ప్రతి ఎన్నికలోనూ గతంలో కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్య నిర్దేశం



అమరావతి : ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో 'గొడ్డలి పార్టీ' చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. మిగతా..2లో

### ఏపీపై ఎల్‌నినో పంజా.. కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్



- ఏపీలో ఎల్‌నినో కారణంగా తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందని షర్మిల ఆందోళన
- ప్రభుత్వం పాలనను గాలికొదిలేసిందని, రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శ
- రాష్ట్రంలో 69 శాతం వర్షపాతం లోటు ఏర్పడిందని, 50 లక్షల ఎకరాలు ప్రభావితమయ్యాయని వెల్లడి
- రైతులకు నష్టపరిహారం, రుణాల రీషెడ్యూల్ సహా పలు డిమాండ్లు
- వెంటనే స్పందించకుంటే రైతులు, ఇతర వర్గాలతో కలిసి సర్కారు వెన్ను విరుస్తామని హెచ్చరిక

మొదటి పేజి తరువాయి

## సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు.

### రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి..

2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. 96 శాతం పూర్తైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

## దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం

అందించనుండగా, వృద్ధాప్యంలో ఉన్న ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం రూ. 25 లక్షలను బ్యాంకులో జమ చేయనున్నారు. పిల్లల చదువు, భవిష్యత్తు, కుటుంబ సంక్షేమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేసీఆర్ స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నాయకులతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సుదర్శన్ రెడ్డి దశదిన కర్మల కార్యక్రమాలు పూర్తయిన తర్వాత జిల్లా ముఖ్య నేతలు సమావేశమై కుటుంబ సంక్షేమానికి సంబంధించిన చర్యలను అమలు అమలు చేస్తారని కేసీఆర్ తెలిపారు

## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు

ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దైవబలం సిద్ధించాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, యాగాలు నిర్వహిస్తూనే ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు దేవాలయాలకు వెళ్లడాన్ని ఎగతాళి చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయం, రైతాంగ సమస్యలపై కనీస అవగాహన లేదని ఆయన ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి, ఆ జిల్లాకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే ఇక్కడి ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. గోదావరి బోర్డు సమావేశంపై ప్రభుత్వ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ 24 గంటల విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. 'హైడ్రా' పేరుతో పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. నీటి హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమ తరహాలోనే మరో భారీ పోరాటానికి సిద్ధమవుతామని కేటీఆర్ హెచ్చరించారు.

## మోదీతో సుఖ్‌బీర్ బాదల్ భేటీ.. పొత్తు పునరుద్ధరణ దిశగా బీజేపీ-శిరోమణి అకాలీదళ్ కసరత్తు

మారుతున్న రాజకీయ సమీ కరణాల నేపథ్యంలో మళ్లీ కమలం పార్టీతో జతక ట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పునర్విభజనపై కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలకు మద్దతు పలకడం కూడా ఈ పొత్తు సంకేతాలలో భాగమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీ పంజాబ్ రాజకీయాల్లో కొత్త మైత్రికి దారితీస్తుందనే చర్చలు జోరందుకున్నాయి.

## చైనాలో 'క్రమశిక్షణ' కేంద్రాలు.. తల్లిదండ్రుల మాట వినకపోతే నిర్బంధమే!

గతంలో ఇంటర్నెట్ వ్యసనం (ఇంటర్నెట్ అడిక్షన్) మాన్పించే పేరుతో టీనేజర్ల కోసం మిలిటరీ తరహా క్రమశిక్షణ కేంద్రాలు చైనాలో వెలిశాయి. అయితే, ప్రజా వ్యతిరేకతతో అవి తమ పేర్లను 'ఫ్యామిలీ ఎడ్యుకేషన్ సెంటర్లు', 'ప్రవర్తనా కేంద్రాలు'గా మార్చుకున్నాయి. ఇప్పుడు ఇవే సంస్థలు పెద్దవాళ్లను కూడా లక్ష్యంగా చేసుకుని తమ వ్యాపారాన్ని విస్తరించాయి. ఈ ఏడాది మార్చిలో బీజింగ్‌లో జరిగిన ఒక సంఘటన ఈ దారుణాన్ని కళ్లకు కట్టింది. పియానో పాఠం చెప్పేందుకు ఒక అపార్ట్‌మెంట్‌కు వెళ్లిన 21 ఏళ్ల సంగీత విద్యార్థినిని ఆమె తండ్రి, అత్త, ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బలవంతంగా కారులో ఎక్కించారు. ఆమె ఫోన్‌ను లాక్కుని, వందల మైళ్ల దూరంలోని హెనాన్ ప్రావిన్స్‌లో ఉన్న ఒక క్రమశిక్షణ కేంద్రంలో 11 రోజుల పాటు నిర్బంధించారు. తన కూతురు ప్రేమ వ్యవహారం నచ్చని తల్లిదండ్రులు, ఆమెను తమ అదుపులో ఉంచుకునేందుకు ఈ పని చేసినట్లు 'సదరన్ పీపుల్ వీక్లీ' నివేదికను ఉటంకిస్తూ 'ది డిప్లొమాట్' పేర్కొంది. ఆరు నెలల నిర్బంధానికి సుమారు 26,800 యువాన్లు (రూ.3.8 లక్షలు), ఏడాదికి 36,800 యువాన్లు (రూ.5.17 లక్షలు) వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయని చైనా మీడియా కథనాలు చెబుతున్నాయి. నిద్రపోయే అలవాట్లను సరిచేయడానికి ఒక 21 ఏళ్ల యువకుడిని, ఒంటరిగా జీవిస్తున్న 25 ఏళ్ల యువతిని వారి కుటుంబ సభ్యులే ఇలాంటి కేంద్రాలకు తరలించారు. కొన్ని కేంద్రాల్లో 33 ఏళ్ల వయసున్న వారు కూడా టీనేజర్లతో కలిసి శిక్షణ పొందుతున్నట్లు తేలింది. చైనా చట్టాల ప్రకారం, ఒక వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించడం మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే నేరం. అయినప్పటికీ, ఈ నిర్బంధం వెనుక తల్లిదండ్రులే ఉండటంతో చట్టం భిన్నంగా స్పందిస్తోందని, ఇదే ఈ సంస్థలకు అలుసుగా మారిందని 'ది డిప్లొమాట్' నివేదిక విశ్లేషించింది. పెద్దయ్యాక తమ నియంత్రణలో లేని పిల్లలను బలవంతంగా దారిలోకి తెచ్చుకునేందుకు తల్లిదండ్రులు ఈ సంస్థలకు డబ్బు చెల్లించి, వారిని నిర్బంధింపజేస్తున్నారని నివేదిక స్పష్టం చేసింది.

## తిరుపతికి మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్.. రూట్ ఫిక్స్ చేసిన రైల్వేశాఖ..

ఈ రైలులో ముందు, వెనుక లోకో పైలట్లు తప్ప ఎవరూ కనిపించలేదు. మొత్తం ఎనిమిది కోచ్‌లు ఈ రైల్లో ఉండగా.. వైట్ అండ్ బ్లూ కలర్‌తో ఉంది. తమిళనాడు నుంచి తిరుపతికి వరకు ఈ రైలుకు ట్రయల్ రన్ నిర్వహించినట్లు తెలుస్తోంది. తమిళనాడు వైపు నుంచి రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుకుంది. ట్రయల్ రన్స్‌లో భాగంగానే ఈ వందే భారత్ రైలు తిరుపతిలో ఆగినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ రైలు పట్టాలెక్కే అవకాశముందని చెబుతున్నారు. అయితే దీనికి సంబంధించి రూట్ మ్యాప్ మాత్రం ఖరారు కాలేదు. తమిళనాడులోని శ్రీపెరంబదూరులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వందే భారత్ రైలును అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. ట్రయల్ రన్ కోసమే తిరుపతికి చేరుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఏపీ మీదుగా ఐదు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే వాటి సంఖ్య ఆరుకు చేరుకుంటుంది. అటు త్వరలో విశాఖపట్నం-బెంగళూరు మధ్య వందే భారత్ స్లీపర్ రైలు ప్రవేశపెట్టేందుకు రైల్వేశాఖ సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన షెడ్యూల్ వివరాలు కూడా ఇటీవల బయటకొచ్చాయి. త్వరలోనే ఏపీలో తొలి వందే భారత్ స్లీపర్ ట్రైన్ అందుబాటులోకి రానుంది. తమిళనాడు నుంచి తిరుపతికి ఈ రైలు నడపనున్నారని అనధికార సమాచారం. ట్రయల్ రన్ నిర్వహించడంతో త్వరలోనే పూర్తి వివరాలు బయటకొచ్చే అవకాశముంది. ప్రస్తుతం తమిళనాడు నుంచి తిరుపతికి వందే భారత్ ట్రైన్ లేదు. దీంతో ఈ రూట్లోనే ట్రయల్ రన్ జరపడంతో ఆ రెండు ప్రాంతాల మధ్య నడపనున్నారని తెలుస్తోంది.

## సరిహద్దులకు 1 కి.మీ పరిధిలో విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయొద్దు

ఎల్‌ఓసీ, ఎల్ఏసీ, అంతర్జాతీయ సరిహద్దులకు 1 కి.మీ. వరకు కొత్త ప్రాజెక్టులకు అనుమతి లేదు- 50 కి.మీ. పరిధిని సున్నిత ప్రాంతంగా ప్రకటించిన కేంద్రం- 50 కి.మీ.లోపు ప్రాజెక్టులకు హోంశాఖ అనుమతి తప్పనిసరి! దేశ సరిహద్దుల వెంబడి పునరుత్పాదక ఇంధన, విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. జాతీయ భద్రతకు ఎలాంటి ముప్పు తలెత్తకుండా సరిహద్దు ప్రాంతాల్లో సోలార్, విండ్, హైబ్రిడ్ ప్రాజెక్టుల ఏర్పాటును నియంత్రించాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. అందులో భాగంగా నియంత్రణ రేఖ వాస్తవాధీన రేఖ, అంతర్జాతీయ సరిహద్దు నుంచి ఒక కిలోమీటర్ పరిధిలో కొత్తగా ఎలాంటి సౌర, పవన, హైబ్రిడ్ పునరుత్పాదక ప్రాజెక్టులను ఏర్పాటు చేయకూడదని శనివారం స్పష్టం చేసింది. సరిహద్దు నుంచి 50 కిలోమీటర్ల పరిధిని సున్నిత ప్రాంతంగా కేంద్ర హోంశాఖ గుర్తించింది. ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న అన్ని సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులకు కేంద్ర హోంశాఖ నుంచి భద్రతా అనుమతి తప్పనిసరి. అయితే సరిహద్దు నుంచి ఒక కిలోమీటర్ వరకు మాత్రం ఎలాంటి ప్రాజెక్టు కార్యకలాపాలకు అనుమతి ఉండదు. ఒక కిలోమీటర్ నుంచి 50 కిలోమీటర్ల మధ్య ప్రతిపాదించే ప్రాజెక్టుల భద్రతా అనుమతిని కేంద్ర హోంశాఖ కేసుల వారీగా పరిశీలిస్తుంది. అదే విధంగా అంతర్జాతీయ సరిహద్దు నుంచి ఒక కిలోమీటర్ నుంచి 20 కిలోమీటర్ల పరిధిలోని ప్రాజెక్టులకు రక్షణశాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అవసరం. ఆ అనుమతిని కూడా ప్రాజెక్టు స్వభావం, ప్రాంతం, భద్రతా పరిస్థితులను బట్టి కేసుల వారీగా పరిశీలిస్తారు. ప్రాజెక్టుల నిర్మాణం, అమలు కోసం సరిహద్దు దేశాలకు చెందిన ఇంజినీర్లు, సిబ్బంది, ఉద్యోగులు, కార్మికులను నియమించడంపైనా కేంద్రం ఆంక్షలు విధించింది. ముఖ్యంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్, చైనాకు చెందిన వ్యక్తులను కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతి లేకుండా ప్రాజెక్టు పనుల్లో నియమించకూడదు. ప్రాజెక్టు అమలు సంస్థకు చెందిన సిబ్బందిని క్షేత్రస్థాయిలోకి పంపించే ముందు వారి వివరాలను ముందస్తుగా ధ్రువీకరించాల్సి

## చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి. అలా చేయకపోతే, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. అందుకే చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి" అని స్పష్టం చేశారు. ఇటీవల డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని, అయితే దానికి ప్రభుత్వం గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగిందని గుర్తుచేశారు. "పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని మేము వాస్తవాలు చెప్పడం వల్లే.. గొడ్డలి పార్టీ మినహా కొన్ని ఇతర పార్టీలకు చెందిన నేతలు కూడా తప్పులు జరగలేదని బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పుడు అదే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన టీచర్లే గొడ్డలి పార్టీ తీరును తప్పుపడుతూ ఆందోళనలు చేపట్టారు" అని చంద్రబాబు వివరించారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి వాస్తవాలు ప్రజల ముందు ఉంచితే, కుట్రలను వారే ఛేదిస్తారని



అన్నారు. దీనికి కర్నూల్‌లో టీచర్లు గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనే నిదర్శనమని తెలిపారు. మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనడానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చానని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యవస్థలను గాడిలో పెడుతూ సంక్షేమం-అభివృద్ధిని సమంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పార్టీ క్రమశిక్షణపై మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుంచి అగ్ర నాయకుడి వరకు అందరికీ పార్టీనే సుప్రీం అని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో 'జీరో టాలరెన్స్' పాటిస్తామని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తాను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నానని అన్నారు. గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా, ప్రతి బూత్‌లోనూ గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై ప్రభావం చూపుతుందని, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్‌లకు, మండల అధ్యక్షులకు తగిన గౌరవం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## ఏపీపై ఎల్‌నినో పంజా.. కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్

మొదటి పేజి తరువాయి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆమె విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తాండవిస్తుంటే, ప్రభుత్వం రైతులను గాలికొదిలేసి రాజకీయాలు, పొగడ్త సభల్లో మునిగి తేలుతోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడితో పాటు ప్రధాని నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను షర్మిల గణాంకాలతో సహా వివరించారు. జూలై చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా సాధారణంతో పోలిస్తే 69 శాతం వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. జూన్ 1 నుంచి జూలై మధ్య వరకు 166.76 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 86.51 మి.మీ. మాత్రమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే మూడు నెలల్లో సైతం 40 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని, దీని ప్రభావం ప్రత్యక్షంగా 50 లక్షల ఎకరాలపై పడిందని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని, ఎటు చూసినా బీడు భూములే కనిపిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని షర్మిల ఆరోపించారు. "పాలనను గాలికొదిలేసి, కులమత కొట్లాటల్లో, కేసుల్లో, మోదీ పొగడ్త సభల్లో మీరు, మీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బిజీగా ఉన్నారు. అటు వైసీపీ, ఇటు కూటమి రెండూ ఒకటే. వీరికి రాష్ట్రం, ప్రజల బాగోగులు పట్టవు" అని ఆమె వ్యాఖ్యానించారు. ఆరేడు నెలలుగా ఎల్‌నినో ముప్పు పొంచి ఉందని ప్రపంచవ్యాప్తంగా హెచ్చరికలు వస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం కనీస కంటింజెన్సీ ప్రణాళికలు కూడా సిద్ధం చేయలేదని దుయ్యబట్టారు. జిల్లాల వారీగా సమీక్షలు, రైతులకు మార్గదర్శకాలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం క్వాంటం, డేటా సెంటర్లంటూ కబుర్లు చెబుతూ కాలం గడుపుతున్నారని, మిమ్మల్ని నమ్ముకున్న లక్షలాది రైతుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీ కాంగ్రెస్ తరఫున పలు డిమాండ్లను ఆమె ప్రభుత్వం ముందు ఉంచారు.

### కాంగ్రెస్ పార్టీ డిమాండ్లు:

1. ఎండిపోయిన పంటలకు ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించాలి.
2. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ఉచితంగా లేదా సబ్సిడీపై అందించాలి.
3. రిజర్వాయర్ల నుంచి చివరి ఆయకట్టు భూములకు కూడా నీరందేలా చూడాలి.
4. వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేయాలి.
5. రైతులకు కొత్తగా వడ్డీ లేని రుణాలు అందించాలి.
6. ఎల్‌నినో నష్టాలను అంచనా వేసి ప్రతి రైతుకు ఉచితంగా పంటల బీమా వర్తింపజేయాలి.
7. పశుగ్రాసం కొరత తీర్చేందుకు పాడి రైతులకు ప్రత్యేక సబ్సిడీలు ఇవ్వాలి.

తక్షణమే మేల్కొని మంత్రులను, ప్రభుత్వ యంత్రాంగాన్ని రంగంలోకి దింపి రైతులను ఆదుకోవాలని షర్మిల సూచించారు. "ఇప్పటికైనా కళ్ళు తెరవకపోతే రైతులు, ఇతర వర్గాల ప్రజలతో కలిసి మీ సర్కారు వెన్ను విరిచి మరీ నిలదీస్తారని మరవకండి" అని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## కుర్చీ కోసం సొంత పార్టీ కార్యకర్తలనే బలితీసుకుంటున్నారు..

మొదటి పేజి తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో, సీఎం చంద్రబాబు విజన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారం, నారా లోకేశ్ కష్టంతో రాష్ట్రం ముందుకు సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. గతంలో 151 సీట్లతో అధికారంలో ఉండి రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన వైసీపీ ఒక 'గొడ్డలి పార్టీ', 'క్రిమినల్ పార్టీ' అంటూ వ్యాఖ్యానించారు. గొడ్డలి పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి.. కుర్చీ కోసం సొంత పార్టీ కార్యకర్తలను, నేతలనే బలితీసుకుంటున్నారని మంత్రి తెలిపారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య నుంచి సుధాకర్, అమర్‌నాథ్ గౌడ్, దళిత బిడ్డ డోర్ డెలివరీ ఘటనలే గత ప్రభుత్వ అరాచకాలకు నిదర్శనమన్నారు. దేవరపల్లిలో మునేశ్వరరావు, పలాసలో దానయ్య యాదవ్, పెంటపాడులో సింగయ్య, కడపలో దస్తగిరి, మాచర్లలో చెన్నారెడ్డి, ఇబ్రహీంపట్నంలో భార్గవ్ బాధితులుగా మారారని చెప్పుకొచ్చారు. పలాసాలో చనిపోయిన నిరుపేద కూలి దానయ్య యాదవ్ కుటుంబాన్ని పరామర్శించని జగన్, హత్య చేసిన వారిని వెళ్లి పరామర్శించడం దారుణమని మండిపడ్డారు. 44 ఏళ్ల నిరుపేద బీసీ బాధితుడు దానయ్య యాదవ్ చనిపోతే 'వయసైపోయింది' అని జగన్మోహన్ రెడ్డి సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. పదవులు అనుభవించడానికి అవినాశ్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, జోగి రమేష్, అంబటి రాంబాబులకు వయసు అడ్డురాలేదా అని మంత్రి ప్రశ్నించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఒకసారి నిజ నిజాలు ఆలోచించుకోవాలని.. పాము పడగ నీడన బతుకుతున్నారని తెలిపారు. వైసీపీ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం కార్యకర్తలను బలిపీఠం ఎక్కిస్తున్నారని మండిపడ్డారు. జగన్ రెడ్డి 'నా బడుగు బలహీన వర్గాలు' అని ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక తీవ్రంగా ఇబ్బంది పెట్టారన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు బీసీలకు అండగా ఉన్నది తెలుగుదేశం పార్టీయే అని పేర్కొన్నారు. తొలి సంతకంతోనే మెగా డీఎస్సీ అమలు చేసి,



కులమతాలకు అతీతంగా ఎంతోమంది బీసీ, బడుగు బలహీన వర్గాల యువతకు ఉద్యోగాలు అందించామని వెల్లడించారు. బీసీలను బ్యాక్‌బోన్‌గా మారుస్తూ ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## దేశ స్వాతంత్ర్యం కోసం బీజేపీ,చేసిందేంలేదు- నీతులు మాత్రమే చెబుతుంటారు

మొదటి పేజి తరువాయి

ఎలాంటి పాత్ర పోషించలేదని ఆరోపించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడింది కాంగ్రెస్ పార్టీయేనని, దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కూడా కాంగ్రెస్ నిరంతరం కృషి చేసిందని అన్నారు. ఈ మేరకు ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ఖర్గే పలు వ్యాఖ్యలు చేశారు స్వాతంత్ర్యం పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి సహకారం లేదని ఖర్గే అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లిన ఆర్ఎస్ఎస్ సభ్యుడు ఎవరైనా ఉన్నారా? బీజేపీకి చెందిన వారు ఎవరైనా స్వాతంత్ర్యం ఉద్యమంలో జైలుకు వెళ్లారా? అంటూ ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ఎవరైనా జైలుకు వెళ్లినా వారు తొలుత కాంగ్రెస్‌లో ఉండి ఆ తర్వాత అటువైపు వెళ్లిన వారై ఉంటారని వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలెవరూ స్వాతంత్ర్యం ఉద్యమంలో పాల్గొన్న దాఖలాలు లేవని ఆరోపించారు.

### 'దేశభక్తిపై మాకు పాఠాలు చెబుతారా?'

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యం ఉద్యమంలో భాగస్వామ్యం లేకపోయినా బీజేపీ నేతలు కాంగ్రెస్‌కు దేశభక్తిపై పాఠాలు, నీతులు చెబుతుంటారని ఖర్గే విమర్శించారు. అసలైన దేశభక్తులు కాంగ్రెస్ పార్టీకి చెందినవారేనని అన్నారు. కాంగ్రెస్ ఎవరినీ భయపడదని, ఎవరూ తమను భయపెట్టలేరని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం ఉద్యమంలో కాంగ్రెస్ పోషించిన పాత్రను ప్రజలు గుర్తుంచుకోవాలని ఆయన కోరారు.



### రాహుల్ గాంధీపై ప్రశంసలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటున్నారని ఖర్గే ప్రశంసించారు. యువత, రైతులు, విద్యార్థులు, పేదల సమస్యలను రాహుల్ గాంధీ నిరంతరం ప్రస్తావిస్తున్నారని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయన దేశవ్యాప్తంగా ప్రజలను కలుస్తున్నారని పేర్కొన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ భారత్ జోడో యాత్ర చేపట్టారని ఖర్గే గుర్తు చేశారు. దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఆయన ప్రజల్లోకి వెళ్లారని అన్నారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు రాహుల్ నిరంతరం పర్యటిస్తున్నారని చెప్పారు. బీజేపీలో ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకునే నాయకుడు ఎవరైనా ఉన్నారా? అని ఖర్గే ప్రశ్నించారు.

### క్విట్ ఇండియా ఉద్యమంతోనే!

1942 ఆగస్టు 8వ తేదీన మహాత్మా గాంధీ ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని మల్లికార్జున ఖర్గే గుర్తు చేసుకున్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆ రోజు ఎంతో కీలకమైందని చెప్పారు. డూ ఆర్ డై, క్విట్ ఇండియా నినాదాలతో మహాత్మా గాంధీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేశారని తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమంతో దేశ ప్రజల్లో బ్రిటిష్ పాలనపై వ్యతిరేకత మరింత పెరిగిందని అన్నారు. ప్రజలంతా ఒక్కటై స్వాతంత్ర్యం కోసం పోరాడారని చెప్పారు. చివరకు బ్రిటిష్ పాలకులు దేశాన్ని విడిచి వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అలాంటి చారిత్రక రోజున హల్ద్వానీలో భారీ బహిరంగ సభ జరగడం ఆనందగా ఉందని అన్నారు.

### ఉత్తరాఖండ్ త్యాగాలను కొనియాడిన ఖర్గే

ఉత్తరాఖండ్ ను దేవభూమిగా పేర్కొన్న మల్లికార్జున ఖర్గే, ఆ ప్రాంతానికి దేశ రక్షణలో కూడా ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. కుమావోం, గర్వాల్ రెజిమెంట్లు దేశవ్యాప్తంగా ఎంతో పేరు పొందాయని చెప్పారు. ఆ ప్రాంతం నుంచి ఎంతోమంది సైనికులు దేశ రక్షణ కోసం సేవలందించారని గుర్తు చేశారు. దేశానికి తొలి పరమ్ వీర్ చక్ర అవార్డు అందుకున్న వీర సైనికుడు కూడా ఆ ప్రాంతం నుంచే వచ్చారని ఖర్గే పేర్కొన్నారు. దేశ రక్షణలో ఉత్తరాఖండ్ ప్రజల పాత్రను ఆయన కొనియాడారు. సరిహద్దుల్లో దేశాన్ని కాపాడుకున్న సైనికులకు ప్రజలంతా గర్వపడాలని అన్నారు.

## ఢిల్లీలో డెంగ్యూ H1N1 కేసులు..

మొదటి పేజి తరువాయి

దీంతో ఢిల్లీ ఆసుపత్రులలో నమోదైన మొత్తం డెంగ్యూ రోగుల సంఖ్య 1,389కి చేరింది. మరోవైపు ఇప్పటివరకు 1,344 ఎ1బీ1 కేసులు నమోదయ్యాయి. డెంగ్యూ లేదా ఎ1బీ1 వల్ల ఎలాంటి మరణాలు నమోదు కాలేదు. డెంగ్యూ అనేది సోకిన దోమల కాటు ద్వారా మానవులకు వ్యాపించే వైరల్ ఇన్ఫెక్షన్. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ప్రకారం, డెంగ్యూ బారిన పడిన చాలామందిలో స్వల్ప లక్షణాలు ఉంటాయి లేదా అసలు లక్షణాలే కనిపించవు. లక్షణాలు కనిపించినప్పుడు, అవి సాధారణంగా ఇన్ఫెక్షన్ సోకిన 4 నుండి 10 రోజుల తర్వాత ప్రారంభమై, 2 నుండి 7 రోజుల వరకు ఉంటాయి.

### సాధారణ డెంగ్యూ లక్షణాలు:

తీవ్రమైన జ్వరం తీవ్రమైన తలనొప్పి కళ్ల వెనుక భాగంలో నెప్పి కండరాలు మరియు కీళ్ల నొప్పులు వికారం మరియు వాంతులు గ్రంథుల వాపు చర్మంపై దద్దుర్లు చాలామంది ఒకటి నుండి రెండు వారాల్లో కోలుకుంటారు. అయితే, కొన్నిసార్లు డెంగ్యూ తీవ్రంగా మారవచ్చు. ముఖ్యంగా జ్వరం తగ్గిన తర్వాత ప్రమాదకర సంకేతాలు కనిపించే అవకాశం ఉంది. డెంగ్యూ ప్రమాద సంకేతాలు తీవ్రమైన కడుపు నొప్పి తగ్గకుండా వచ్చే వాంతులు వేగంగా ఊపిరి తీసుకోవడం చిగుళ్ల లేదా ముక్కు నుండి రక్తం కారడం వాంతులు లేదా మలంలో రక్తం పడటం తీవ్రమైన దాహం చర్మం తెల్లబడటం మరియు చల్లబడటం అలసట, బలహీనత లేదా నిరసన డెంగ్యూకి ప్రత్యేకమైన చికిత్స లేదు. రోగులు వైద్య సలహా తీసుకోవాలని, విశ్రాంతి తీసుకోవాలని మరియు సమృద్ధిగా ద్రవ పదార్థాలు తాగాలని ఔనూ సూచిస్తుంది. నొప్పి మరియు జ్వరాన్ని తగ్గించడానికి పారాసిటమాల్‌ను ఉపయోగించవచ్చు, అయితే ఆస్ప్రిన్ మరియు ఇబుప్రోఫెన్‌లను



తీసుకోకూడదు, ఎందుకంటే ఇవి రక్తస్రావం అయ్యే ప్రమాదాన్ని పెంచుతాయి. సీజనల్ ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్ తీసుకోవడం, ముఖ్యంగా ఎక్కువ ప్రమాదం ఉన్నవారు క్రమం తప్పకుండా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకుని ఆరబెట్టుకోవడం దగ్గు లేదా తుమ్ము వచ్చినప్పుడు నోరు మరియు ముక్కును మూసుకోవడం ఉపయోగించిన టిష్యూలను సరిగ్గా పారవేయడం అనారోగ్యంతో ఉన్నవారికి దూరంగా ఉండటం కళ్ళు, ముక్కు మరియు నోటిని తరచుగా తాకకపోవడం అనారోగ్యంగా ఉన్నప్పుడు ఇంట్లోనే ఉండటం ఇన్‌ఫ్లుయెంజాను నివారించడానికి టీకా తీసుకోవడమే ఉత్తమ మార్గమని ఔనూ స్పష్టం చేసింది మరియు ఏటా టీకా తీసుకోవాలని సూచించింది. ఇప్పటివరకు నమోదైన కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, డెంగ్యూ లేదా ఎ1బీ1 రెండింటి వల్ల ఎలాంటి మరణాలు నమోదు కాకపోవడం ఉపశమనం కలిగించే అంశం. ఢిల్లీ ఆసుపత్రులలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులతో కలిపి ఇప్పటివరకు 1,389 డెంగ్యూ కేసులు నమోదు కాగా ఎ1బీ1 కేసుల సంఖ్య 1,344కు చేరింది. ఈ రెండు ఇన్ఫెక్షన్ల వల్ల ఇప్పటివరకు ఎలాంటి మరణాలు సంభవించలేదు. దీనికి సంబంధించిన లక్షణాలు, ప్రమాద సంకేతాలు, చికిత్స మరియు నివారణ మార్గాలు ఓసారి పరిశీలిస్తే..

# సంపాదకీయం

## విశ్లేషణలలో మేటి... మాటల ఘనాపాఠి

ఒక మనిషి జీవితం ఎంతకాలం సాగిందన్నది చరిత్రకు పెద్ద విషయం కాదు. ఆ జీవితం సమాజానికి ఎంత వెలుగునిచ్చిందన్నదే అసలైన ప్రమాణం. అలాంటి ప్రమాణాలతో కొలిచినప్పుడు తెలుగు జర్నలిజం ఆకాశంలో ధ్రువతారగా ప్రకాశించే పేరు తుర్లపాటి కుటుంబరావు. ఆగస్టు 10 ఆయన జన్మదినం మాత్రమే కాదు; అది తెలుగు జర్నలిజం నిబద్ధతను, ప్రజాజీవిత విలువలను, మానవ సంబంధాల గొప్పతనాన్ని స్మరించుకునే సందర్భం కూడా. 1933లో విజయవాడలో జన్మించిన తుర్లపాటి కుటుంబరావు పద్నాలుగేళ్ల వయసులోనే జర్నలిజంలో అడుగుపెట్టారు. ఏడున్నర దశాబ్దాలకు పైగా సాగిన ఆయన పాత్రికేయ ప్రయాణం నేటి తరానికి ఆశ్చర్యాన్ని, భావితరాలకు స్ఫూర్తిని కలిగిస్తుంది. నాటి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నుంచి నేటి నరేంద్ర మోదీ వరకు, 'జాతిపిత' మహాత్మాగాంధీ ఆలోచనల నుంచి ఆధునిక భారత రాజకీయ పరిణామాల వరకు, స్వాతంత్ర్య సమరయోధుల నుంచి సినీ దిగ్గజాల వరకు... భారత ప్రజాజీవితంలోని ఎందరో మహనీయులతో ప్రత్యక్ష అనుబంధం కలిగిన అరుదైన వ్యక్తి తుర్లపాటి. జర్నలిజం అంటే వార్తలను అందించడం మాత్రమే కాదని, సమాజానికి విలువలను అందించడమని తుర్లపాటి నిరూపించారు. దాదాపు యాభై సంవత్సరాల పాటు నిరంతరాయంగా సాగిన 'వార్తల్లోని వ్యక్తి' శీర్షిక వ్యక్తిత్వాల విశ్లేషణకు, నాయకత్వ విలువల అంచనాలకు ఒక పాఠశాల. వ్యక్తులను కీర్తించడం కాదు, వారి జీవితం సమాజానికి అందించే సందేశాన్ని వెలికితీయడం ఆ రచనల ప్రత్యేకత. విశ్లేషణ ఆయనకు అలవాటు. వాక్చాతుర్యం ఆయనకు వరం. అందుకే ఆయనను చాలా మంది 'మాటల ఘనాపాఠి' అని సంబోధించేవారు. వేలాది సభలకు అధ్యక్షత వహించి, దాదాపు 18 వేల ఉపన్యాసాలతో 'గిన్నిస్' గుర్తింపు పొందారు.సాహిత్యం, చరిత్ర, రాజకీయాలు, సంస్కృతి, సినిమా... ఏ రంగాన్ని తీసుకున్నా తుర్లపాటి ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. మహానాయకులు, జాతి నిర్మాతలు, 1857 విప్లవ వీరులు, నా కలంగళం వంటి రచనల ద్వారా యువతకు చరిత్రను పరిచయం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఫ్యాన్స్ అసోసియేషన్‌ను స్థాపించి కళాకారులను సత్కరించే సంప్రదాయానికి బాటలు వేశారు. నంది అవార్డుల ఆవిర్భావానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. అక్కినేని నాగేశ్వరరావుకు 'నటసామ్రాట్', కృష్ణకు 'సూపర్ స్టార్' వంటి బిరుదులు అందించిన దూరదృష్టి ఆయనది. కళాకారుల ప్రతిభను సమాజం ముందుకు తీసుకురావడంలో ఆయన పాత్ర విశిష్టమైనది. భారత ప్రభుత్వం ప్రదానం చేసిన పద్మశ్రీ పురస్కారం, ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించిన కళాప్రపూర్ణ, జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి వచ్చిన అనేక గౌరవాలు... ఇవన్నీ ఆయన వ్యక్తిగత విజయాల గుర్తింపే. మా నాన్నగారు 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు దివంగత తుంగా రాజగోపాలరెడ్డి స్మృత్యంకంగా స్థాపించిన 'తుంగా అవార్డు' అందుకున్న ప్రముఖులలో తుర్లపాటి ఒకరు కావడం మా సంస్థకే గర్వకారణం. ఎన్ని సత్కారాలు, పురస్కారాలు అందుకున్నా ఆయనకు అసలైన సంపద మాత్రం ప్రజల ప్రేమాభిమానాలే. అధికారం, ఆస్తులు, పదవుల కోసం ఆయన ఎప్పుడూ ప్రయత్నించలేదు. అనేక మంది ప్రధానులు, ముఖ్యమంత్రులతో సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆ పరిచయాలను ఉపయోగించుకోలేదు. నీతి, నిజాయితీ, నిష్పాక్షికత ఆయనకు అలంకారాలు కాదు; అవే ఆయన జీవన విధానం. వ్యక్తిగత జీవితంలో ఎన్నో విషాదాలను ఎదుర్కొన్నారు. జీవిత భాగస్వామిని, కుమార్తెను కోల్పోయారు. ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా చిరునవ్వును కోల్పోలేదు. రాజకీయాలకు అతీతంగా అందరితో ఆప్యాయత, కుల మతాలకు అతీతంగా మానవత్వం, చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ ఆదరించే గుణం... ఇవే ఆయనను మహోన్నత వ్యక్తిగా నిలబెట్టాయి. తుర్లపాటి జీవితం ఒక విలువల పాఠ్యగ్రంథం. జర్నలిజం అంటే అధికారాన్ని ప్రశ్నించడం, సమాజాన్ని చైతన్యపరచడం, సత్యాన్ని కాపాడడం, మానవత్వాన్ని నిలబెట్టడం అని ఆయన తన జీవితంతో నిరూపించారు. ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు; ఒక విశ్వవిద్యాలయం. ఒక పాత్రికేయుడు కాదు; ఒక విలువల ఉద్యమం. ఒక వక్త కాదు; ఒక చైతన్య స్వరం. తుర్లపాటి జన్మదినాన్ని స్మరించుకుంటూ మనం నివాళి అర్పించాల్సింది కేవలం ఒక మహనీయునికే కాదు... ఒక ఆదర్శానికి, నిబద్ధతకు, నిజాయితీకి, మానవత్వానికి. తెలుగు జర్నలిజం ఉన్నంతకాలం తుర్లపాటి కుటుంబరావు పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. ఎందుకంటే చరిత్రలో కొన్ని పేర్లు పుస్తకాలలో మాత్రమే ఉండవు; తరతరాల మనుషుల మనసుల్లో విలువలుగా చిరకాలం జీవిస్తాయి.

# ప్రతిభ ఎంతున్నా ఫలితాలు అంతంతే!



భారత్ ప్రతిభావంతులను ఎంపిక చేసుకుని, శాస్త్రీయ శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రపంచస్థాయి యువ శాస్త్రవేత్తలను తయారుచేస్తోంది. ప్రతిభను కనుగొనడంలో ఇండియా ఆరితేరినా, దాన్ని నిలబెట్టుకోవడంలో మాత్రం విజయవంతం కాలేకపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ తన మేధోసంపత్తిని ఉపయోగించి ప్రపంచస్థాయి వ్యాపార సంస్థలను సృష్టించగలదా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఒక దేశం విజయానికి అసలైన కొలమానం- అక్కడ తయారయ్యే నిపుణ విద్యార్థుల సంఖ్య ఒక్కటే కాదు, వారిలో నుంచి ఎదిగి వచ్చే నవీకరణ సాధకులు, వ్యవస్థాపకుల సంఖ్య కూడా. మరి ఈ విషయంలో భారత్ ఎలా ముందుకెళ్లాలి? దక్షిణ అమెరికాలోని కొలంబియా దేశం నుంచి ఇటీవల అయిదుగురు భారతీయ టీనేజర్లు పతకాలతోపాటు అంతకంటే విలువైనదానితో స్వదేశానికి తిరిగి వచ్చారు. మన దేశపు మహాసంపద- ప్రతిభేనని వారు గుర్తుచేశారు. జులైలో జరిగిన 56వ అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో ఇండియా తరఫున పాల్గొన్న అయిదుగురు సభ్యుల బృందం అయిదు బంగారు పతకాలను గెలుచుకుంది. తద్వారా చైనా, రష్యా, దక్షిణ కొరియా, కజకిస్థాన్, తైవాన్ వంటి శాస్త్రవిజ్ఞాన దిగ్గజాలతోపాటుగా భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 85 దేశాల నుంచి వచ్చిన 381 మంది అత్యంత ప్రతిభావంతులైన పాఠశాల విద్యార్థులతో భారతీయులు పోటీపడ్డారు. పాఠ్యపుస్తకాల ద్వారా నేర్చినదాన్ని కాకుండా, అసలైన ఆలోచనాశక్తిని డిమాండ్ చేసే కఠినమైన అయిదు గంటల పరీక్షల్లో భారతీయ బృందం సత్తా చాటింది. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సంస్థ ఆధ్వర్యంలోని హోమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ (హెచ్‌బీసీఎస్‌ఈ) సుమారు మూడు దశాబ్దాలుగా చేసిన కృషి ఫలితమే ఇది. గత దశాబ్దంలో ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో తలపడిన ప్రతి భారతీయ ప్రతినిధి పతకంతో తిరిగి వచ్చారు. వాటిలో దాదాపు మూడింట రెండొంతులు పసిడివే. అయితే, ఈ అద్భుత విజయం వెనక ఒక ఆందోళనకరమైన వాస్తవముంది. హెచ్‌బీసీఎస్‌ఈ ప్రకారం, భారతీయ ఒలింపియాడ్ పతక విజేతల్లో దాదాపు 64శాతం మంది పీహెచ్‌డీ చేసేవారే. కానీ, వారిలో 32శాతం మందే ఇండియాలో ఉంటున్నారు. మిగతావారు అవకాశాల అన్వేషణలో భాగంగా విదేశాలకు వెళ్లిపోతున్నారు.

### స్టార్టప్‌ల సృష్టిలో ముందున్నాం కానీ...

స్టార్టప్‌లు పరిశోధనలను ఉత్పత్తులుగా మారుస్తాయి. పెట్టుబడులను ఆకర్షించి, ఉపాధిని సృష్టించి, ఉత్పాదకతనూ పెంచుతాయి. ఒక స్టార్టప్ వంద కోట్ల డాలర్ల విలువను సాధించడం ద్వారా యూనికార్న్‌గా మారుతుంది. ప్రపంచంలో స్టార్టప్‌ల సంఖ్యలో అమెరికా, చైనాల తరవాతి స్థానం ఇండియాదే. వందకు పైగా భారతీయ స్టార్టప్‌లు యూనికార్న్‌లుగా నిలిచాయి. స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, ఆధార్, యూపీఐల విస్తరణ, మెరుగైన ఇంటర్నెట్ కనెక్టివిటీ, నిపుణ యువ జనాభా... ఇవన్నీ కలిసి నవకల్పనలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాయి. భారతీయ స్టార్టప్‌లు ఫైనాన్షియల్ టెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఏఐ, రవాణా, హరిత ఇంధనాలు, అంతరిక్ష సాంకేతికతల్లో నిమగ్నమయ్యాయి. లక్షలాది వినియోగదారులకు సేవలు అందిస్తూ నాణ్యమైన ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. ఫిన్‌టెక్‌లో నితిన్, నిఖిల్ కామత్‌లు స్థాపించిన జెరోధా తక్కువ ఖర్చుతో కూడిన బ్రోకరేజ్ ద్వారా రిటైల్ ఇన్వెస్టింగ్‌ను మార్చేసింది. పైన్‌లాబ్స్ మర్చంట్ కామర్స్ డిజిటల్ చెల్లింపుల్లో అగ్రగామిగా అవతరించింది. ఫల్గుణి నాయర్ స్థాపించిన నైకా టెక్నాలజీ భారతదేశ సౌందర్య రిటైల్ పరిశ్రమను విప్లవాత్మకంగా మార్చింది. లెన్స్‌కార్ట్ కళ్లద్దాల మార్కెట్‌లో సంచలనం సృష్టించింది. బెంగళూరుకు చెందిన సర్వమ్‌ఏఐ భారతదేశపు మొట్టమొదటి ప్రధాన జెన్-ఏఐ యూనికార్న్‌గా అవతరించింది. ఇది భారతీయ భాషల కోసం ప్రత్యేకించిన సావరిన్ లాంగ్వేజ్ మోడల్స్, స్పీచ్ టెక్నాలజీలను అభివృద్ధి చేస్తోంది. హెల్త్‌కేర్ ఇన్నోవేషన్‌కు ఇన్నోవాసర్ వంటి కంపెనీలు ప్రతినిధులుగా నిలుస్తున్నాయి. మన వ్యవస్థాపకులు ప్రపంచస్థాయి వ్యాపార సంస్థలను నిర్మించగలరనేందుకు ఈ కంపెనీలన్నీ నిదర్శనాలే. భారత సంతతి వ్యవస్థాపకులు విదేశాల్లో 150కి పైగా యూనికార్న్‌లను సృష్టించారు. ఒక్క అమెరికాలోనే 96 యూనికార్న్‌లను నెలకొల్పారు. ఐఐటీ మద్రాస్ పట్టభద్రుడు అరవింద్ శ్రీనివాస్ సహవ్యవస్థాపకుడిగా ఉన్న పెర్‌ప్లెక్సిటీ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ కంపెనీల్లో ఒకటిగా నిలిచింది. 100 బిలియన్ డాలర్లకు పైగా విలువైన డేటాబ్రిక్స్- ఏఐ, క్లౌడ్ డేటా అనలిటిక్స్‌లో ప్రపంచ నేతగా మారింది. నిజానికి భారతీయులు ఇక్కడికంటే విదేశాల్లోనే ఎక్కువగా యూనికార్న్‌లను నిర్మించారు. ఎందుకంటే, అమెరికా వంటి దేశాల్లో స్టార్టప్‌లకు మన దగ్గరకంటే ఎక్కువ పెట్టుబడులు లభిస్తాయి. స్టాన్‌ఫోర్డ్, ఎంఐటీ వంటి ఉన్నత విద్యాలయాలు పరిశోధకులను ప్రోత్సహిస్తాయి. వారు పరిశ్రమలతో కలిసి పనిచేస్తారు. మేధోహక్కులకూ రక్షణ లభిస్తుంది. స్టాక్-ఆప్షన్ విధానాలు, ప్రపంచ మార్కెట్లు అందుబాటులో ఉంటాయి. చైనీయుల యూనికార్న్‌లు మాత్రం స్వదేశంలోనే ఎక్కువగా ఉన్నాయి. చైనా తన ప్రతిభను విజయవంతంగా నిలుపుకొని, వాణిజ్యీకరించింది. దీనికి విరుద్ధంగా, భారత్ తన అత్యంత ప్రతిభావంతులైన ఆవిష్కర్తల్లో అత్యధికులను ఎగుమతి చేస్తూనే ఉంది. ప్రతిభను వాణిజ్యీకరించడం ఇంకా నేర్చుకుంటూనే ఉంది.

### వారి తోడ్పాటు కీలకం...

భారత్‌లో ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ, సెమీకండక్టర్లు, బయోటెక్నాలజీ, రోబోటిక్స్ రంగాల్లో పరిశోధన-అభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులు గణనీయంగా పెరగాలి. ఉన్నత విద్యాసంస్థలు నవ కల్పనలకు, వ్యవస్థాపకతకు కేంద్రాలుగా మారాలి. బోధన సిబ్బంది, విద్యార్థులు పరిశోధనలను వాణిజ్యీకరించేలా ప్రోత్సహించాలి. స్వదేశంలో భారీ వెంచర్ క్యాపిటల్ నిధులను సృష్టించాలి. డీప్-టెక్నాలజీ స్టార్టప్‌లకు ఆర్థిక సాయం అందించాలి. వ్యవస్థాపకులు అనుమతుల కోసం కాకుండా ఆవిష్కరణలపై అధిక సమయం వెచ్చించేలా సాయపడాలి. పేటెంట్లు, మేధోసంపత్తి హక్కులను వేగంగా అందించడంతో పాటు టెక్నాలజీ లైసెన్సింగ్‌ను సులభతరం చేయాలి. విదేశాల్లో విజయవంతమైన భారత సంతతి వ్యవస్థాపకులను సలహాదారులుగా, పెట్టుబడిదారులుగా, సహచరులుగా మార్చుకోగలిగితే... ప్రపంచస్థాయి వ్యాపార సంస్థలను నిర్మించడం తేలికవుతుంది. తద్వారా తదుపరి తరం అంతర్జాతీయ యూనికార్న్‌లను సృష్టించడంలో భారత్ దూసుకుపోతుంది.

# సాగు దండుగ అన్నోళ్లు మళ్లీ మోపయిండ్రు



మేం వద్దంటే పోరాటాలు చేశారు.. మేం వద్దంటే గోదావరి మీద ప్రాజెక్టులు కట్టారు.. మేం వద్దంటే కృష్ణా మీద ప్రాజెక్టులు కట్టారు.. మేం కష్టపడి దశాబ్దాల పాటు ఎప్పటికీ పూర్తి కాకుండా పెండింగ్ లో పడేస్తే.. వాటిని పూర్తి చేసుకున్నారు. మేం వద్దన్నా.. కూడదన్నా వ్యవసాయాన్ని పండుగ చేసుకున్నారు.. మాకంటే దండిగా పంటలు పండిస్తారా? ఎంత అహంభావం? మీరు రైతుబంధు ఇచ్చిన పాపానికి చచ్చినట్టు మేం ఇవ్వాల్సి వచ్చింది. హమ్మా!! మాకే పాఠాలు చెప్పడానికి ప్రయత్నిస్తారా? ఒక విజనరీ విజన్‌నే ప్రశ్నించడానికి దుస్సాహసం చేస్తారా? మీరెట్లా ఉండాలో, ఎలా ఉండాలో, మిమ్మల్ని ఎక్కడ ఉంచాలో మాకు తెలుసు. తిండి తినటం కూడా రాని మిమ్మల్ని పైకి తీసుకువచ్చాం.. అలాంటి మాకు వ్యతిరేకంగా, మా పట్ల కృతజ్ఞత లేకుండా కేసీఆర్ అనే ఒకానొక నాయకుడు మిమ్మల్ని పక్కదారి పట్టించాడు. ఇదీ రాష్ట్ర విభజనకు శత్రువు, ప్రపంచ విజనరీ మనోగతం.తెలంగాణలో సాగు బాగుపడి, ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్ బాబు దండుగ అని నిర్లక్ష్యం చేసిన వ్యవసాయాన్ని ప్రత్యేక రాష్ట్రంలో పండుగ చేసుకున్నాం. కానీ ఇప్పుడు కూడా తమ బతుకులపై, భవిష్యత్తుపై, భావితరాలపై దృష్టి పెట్టకుండా తెలంగాణపై పడి ఏడుస్తున్నారు. వాళ్ల మనసులో ఇలా అనుకుంటున్నారని అనిపిస్తున్నది. అప్పుడే చెప్పాం.. ఇష్టం ఉన్నా.. లేకున్నా మాతోనే ఉండాలని హెచ్చరించాం. మమ్మల్ని కాదంటే మీకు రాళ్లూ రప్పలే దిక్కు అని భవిష్యత్తు కూడా చూపించాం. మీకు నీళ్లు రావాలో వద్దో మేం నిర్ణయిస్తాం. మీరు వ్యవసాయం చేయాలో వద్దో కూడా మేమే చెప్తాం. మీరు వలసలు పోయి బతకడానికే కదా బొంబాయి బస్సులు వేసింది. అక్కడెక్కడికో పోయి బతక్క.. మళ్లా వెనక్కి వస్తారా? రాష్ట్రం సాధించుకొని, బరాజ్‌లు కట్టుకున్నారు.. చెరువులు, చెక్‌డ్యామ్‌లు నింపుకొన్నారు. మేం బయటకు వలసలకు పంపించినోళ్లను తిరిగి వెనక్కి తెప్పించుకున్నారు. అన్నింటికీ మించి మా దగ్గరి నుంచి కూలి పనికి మనుషులు వచ్చేలా చేశారు. ఎంత అహంకారం మీది. అని కుళ్లుకుంటున్నాడు ప్రపంచానికి ఐటీని పరిచయం చేసినట్టు చెప్పుకొనే స్వయం ప్రకటిత మేధావి. అంతేనా.. మన బతుకులు బాగుపడితే చూడలేని బాబులు, బాబుల శిష్యులు మళ్లీ మన తెలంగాణపై పెత్తనం చెలాయిస్తున్నారు. కొట్లాడి రాష్ట్రం సాధించుకున్న ప్రజలపై కక్ష సాధించేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. పట్టిపీడించడం అంటే ఎలా ఉంటుందో చూపిస్తున్నారు. జనాలను కష్టాల్లోకి నెట్టేసి ఇలా అనుకుంటున్నారు. ఇప్పుడేమైంది.. మీ బతుకులు మా పిడికిట్లో చిక్కుకున్నాయి. ఢిల్లీలో మావోడే ఉన్నడు. నీళ్ల శాఖలో కూడా మావోడినే పెట్టుకున్నం. మీ దగ్గర ఉన్నవాళ్లంతా మా తోలుబొమ్మలు. వారికి మేం ఎంత చెప్తే అంత.. మేం చెప్పకపోతే నోట్లో ముద్ద కూడా పెట్టుకోరు. అంతటి విధేయులు. మీ నీళ్ల శాఖలోనూ మావోళ్లందరినీ చొప్పించాం. భలే ఉన్నది కదా.. మా ఆట. ఇప్పుడు నీళ్ల విషయంలో, ప్రాజెక్టుల విషయంలో ఏం జరుగుతున్నదో కూడా తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా మేం నడిపిస్తున్న డ్రామాను చూస్తూ ఉండండి. గోదావరి మీద మీరు కట్టుకున్న ప్రతీ ప్రాజెక్టు అనుమతినీ రద్దు చేపిస్తాం. కృష్ణా మీద ఒక్క ప్రాజెక్టు కూడా కట్టకుండ చేస్తం. మీకు నీళ్లు ఎట్లా వస్తయో చూస్తం. ఒక్క చుక్క కూడా రాకుండా చేస్తం. ఎవరన్నా అడిగితే.. పాపం గడ్డమీదున్నరు.. వాళ్లకు నీళ్లెట్ల వస్తయి అని సన్నాయి నొక్కులు కూడా నొక్కుతాం. నీళ్లు లేవు.. వ్యవసాయం లేదు.. మీకేదీ అక్కరలేదు. నోరుమూసుకుని పడి ఉండండి.. మేం చెప్పినట్టు నడుచుకోండి.. మీకు నీళ్లు అవసరం లేదు. వ్యవసాయం వద్దు. వలసలు మీకు ఇంతకుముందే అలవాటు చేశాం కదా.. కొత్తేమీ కాదు.. కావాలంటే మావోళ్లకు చెప్పి నాలుగు బస్సులు, రైళ్లు వేయిస్తాం పొండి. మళ్లీ తిరిగి వచ్చారా తస్మాత్ జాగ్రత్త! తిండి కావాలంటే నాలుగు మెతుకులు పడేస్తాం.. తినండి. నూకలు తిని బతకండని మావోడు ఢిల్లీలోనే చెప్పాడు కదా.. అప్పుడే మర్చిపోయారా? ఎప్పుడన్నా వానలు పడితే.. ఏమన్నా పండించుకోండి. అంతేకానీ, ప్రాజెక్టులు, నీళ్లు, వ్యవసాయం అని అన్నారో.. మా తడాఖా చూపిస్తాం. ఇట్లాంటి బాబులను, బాబులకు ఊడిగం చేసే బానిసల గుట్టుమట్టు తెలుసుకొని మసలుకోవాల్సి ఉన్నది. అదనుచూసి ఓటు అనే కర్రుకాల్చి వాతపెట్టాల్సిన చైతన్యం ప్రదర్శించాల్సి ఉన్నది.

# పోలీస్ నోటిఫికేషన్‌లో అన్నీ కొర్రీలే?




ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ నిరుద్యోగ అభ్యర్థుల్లో తీవ్ర మానసిక క్షోభ, అసంతృప్తిని రగిలిస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం విడుదల చేసిన 7,437పోలీస్ పోస్టుల నోటిఫికేషన్‌లో ఎన్నో నిబంధనల చిక్కులు ఎదురవుతున్నాయి. వయోపరిమితి సడలింపు, లాంగ్ జంప్ పెంచడం, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి చేయడంతోపాటు గ్రేటర్ పరిధిలోని ఉద్యోగాలను మినహాయించడం వంటి అంశాలు అభ్యర్థులను తీవ్రఆందోళనకు గురి చేస్తున్నాయి. రిక్రూట్‌మెంట్ బోర్డు విధించిన కఠిన నిబంధనలు నిరుద్యోగులకు కంటి నిండా కునుకు లేకుండా చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 13 వేల ఉద్యోగాలను మాత్రమే నింపింది. పైగా తాము ఇవ్వని 67, 673 ఉద్యోగాలను ఇచ్చినట్టుగా ప్రచారం చేసుకుంటున్నది. వారం రోజుల క్రితం 7,437 పోలీస్ ఉద్యోగాలతో నోటిఫికేషన్ జారీ చేసింది. కాని ఏజ్ మాత్రం పెంచకపోగా, తగ్గించింది. కేసీఆర్ ప్రభుత్వంలో కరోనా కారణంగా జీవో నంబర్ 48 జారీ చేసి, కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు వయోపరిమితిని 3 ఏండ్లు సడలించింది. నోటిఫికేషన్ సమయంలో విద్యార్థుల డిమాండ్ మేరకు జీవో నంబర్ 60 జారీ చేసి, మరో రెండేండ్ల సడలింపు ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కానిస్టేబుల్ పోస్టులకు 34 ఏండ్లు, ఎస్ఐ పోస్టులకు 37 ఏండ్ల వయోపరిమితి పెంచుతూ 2024 ఫిబ్రవరి 8న జీవో నంబర్ 31 జారీ చేసింది. కానీ జీవో నంబర్ 31 అమల్లో ఉన్న రెండేండ్లలో పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషనే రాలేదు. జీవో కాలపరిమితి ముగియడంతో 2026 మే 5న జీవో నంబర్ 87 జారీ చేసింది. ఈ జీవో ద్వారా కానిస్టేబుల్ ఉద్యోగాలకు 34 ఏండ్లు, ఎస్ఐ ఉద్యోగాలకు 37 ఏండ్ల వయోపరిమితి కల్పించకపోగా 2 ఏండ్లు తగ్గించి 32, 35కు పరిమితం చేసింది. కానిస్టేబుల్ పోస్టులకు 36, ఎస్ఐ జాబులకు 38 ఏండ్ల వయోపరిమితి కల్పించాలని నిరుద్యోగులు ఆందోళన బాట పట్టారు. అయినా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో కానిస్టేబుల్ పోస్టులకు వయో పరిమితి 35 ఏండ్లు, ఎస్ఐ ఉద్యోగానికి 38 ఏండ్లుగా ఉన్నది. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మాత్రమే ప్రభుత్వం లాంగ్ జంప్‌ను 4 మీటర్లకు పెంచి నిరుద్యోగ అభ్యర్థులను మానసిక క్షోభకు గురిచేస్తున్నది. ఈ నిబంధన ఆంధ్రప్రదేశ్‌లో 3.8 మీటర్లు, కేరళలో 3.5 మీటర్లు, కర్ణాటకలో 3.8 మీటర్లు, తమిళనాడులో 3.8 మీటర్లుగా అమల్లో ఉన్నది. దేశ సరిహద్దులను కాపాడే సైనికులకు కూడా 3.6 మీటర్ల నిబంధననే అమలు చేస్తున్నారు. ఫైర్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు ఫోర్‌వీలర్ లైసెన్స్ ఉంటేనే దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన విధించారు. గ్రామీణ ప్రాంత మహిళా అభ్యర్థులు ఎంత మేరకు లైసెన్స్‌లు కలిగి ఉంటారో రిక్రూట్‌మెంట్ బోర్డుకే తెలియాలి. జూలై 29న జారీ చేసిన పోలీస్ నోటిఫికేషన్‌లో గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి ఉద్యోగాలను చేర్చలేదు. గతంలో గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్లు ఉండగా కొత్తగా ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త కమిషనరేట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందుకు సంబంధించి జీవో నంబర్ 81 జారీ చేసింది. ఇప్పుడు ఆ జీవో నంబర్ 81 రాష్ట్రపతి ఉత్తర్వులో చేర్చిన తర్వాతనే గ్రేటర్ పరిధిలో ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ఇందుకు ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి పాత మూడు కమిషనరేట్ల ప్రకారమే నోటిఫికేషన్ జారీ చేసి, కొత్త కమిషనరేట్లను వచ్చే నోటిఫికేషన్‌లో అమలు చేయవచ్చని విద్యార్థులు సూచిస్తున్నారు. ఈ నోటిఫికేషన్‌లోనే గ్రేటర్ పరిధిలోని ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కానిస్టేబుల్ ఉద్యోగ దరఖాస్తుకు రూ.1200 (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600), ఎస్ఐ ఉద్యోగ దరఖాస్తుకు రూ.1500 (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750) ఫీజును నిర్ణయించింది. ఒక్క రూపాయి కూడా ఫీజు తీసుకోకుండా ఉద్యోగ దరఖాస్తులకు అవకాశం కల్పిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో, ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. కానీ ఇప్పుడు భారీగా ఫీజులు పెంచడమేందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. దాదాపు 8 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకొనే నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వం వ్యాపారం చేయాలని చూస్తున్నదని విద్యార్థులు విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో 19 వేల పోలీసు ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని డీజీపీ చెప్తుంటే ప్రభుత్వం కేవలం 7,437 ఉద్యోగాలతో నోటిఫికేషన్ జారీ చేసింది. ఖాళీగా ఉన్న మొత్తం ఉద్యోగాలను భర్తీ చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. మొత్తం ఖాళీలు నింపకుండా, వయోపరిమితి సడలింపు ఇవ్వకుండా, లాంగ్ జంప్ నిబంధనలు కఠినతరం చేస్తూ, లైసెన్సింగ్ విధానాన్ని తీసుకువచ్చి, గ్రేటర్ ఉద్యోగాలను చేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను మానసిక సంఘర్షణకు గురిచేస్తున్నది. తక్షణమే నిరుద్యోగుల డిమాండ్లను అంగీకరించి, వారి సూచనలు పాటిస్తూ నోటిఫికేషన్ జారీ చేయాల్సిన అవసరం ఉన్నది.

ప్రజా పిలుపు
PRAJA PILUPU RNI:TGTEL/26/A5230
ఆదివారం -09- ఆగస్టు - 2026

## ప్రశాంత వాతావరణంలో బోనాల పండుగ నిర్వహించాలి



ఐడీఏ బొల్లారం: **ప్రజా పిలుపు ఆగస్టు 08 :** ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించనున్న బోనాల పండుగను ప్రజలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని స్టేషన్ హౌస్ అధికారి సుధీర్ కుమార్ కోరారు.బోనాల పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ తరఫున అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. పండుగ నిర్వాహకులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.నిబంధనలకు విరుద్ధంగా ధ్వని పరికరాలను వినియోగించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సుధీర్ కుమార్ కోరారు.

## సూర్య పిన్నాకిల్ 3లో 42 పాఠశాలల విద్యార్థుల ప్రతిభ ప్రదర్శన




పటాన్ చెరు**ప్రజా పిలుపు ఆగస్టు 08 :** సూర్య ది గ్లోబల్ స్కూల్, అమీన్‌పూర్ క్యాంపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సూర్య పిన్నాకిల్--సీజన్ 3 ఘనంగా సాగింది. ఇందులో 42 పాఠశాలలకు చెందిన 1,200 మందికి పైగా విద్యార్థులు పాల్గొని ఆర్ట్, డ్యాన్స్, బాస్కెట్‌బాల్, ఖో–ఖో పోటీల్లో ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా సూర్య ది గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్, ట్రస్టీ ఏవిఎల్ ధరిత్రి మాట్లాడుతూ... ఇలాంటి వేదికలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి, సృజనాత్మకతను పెంపొందిస్తాయని అన్నారు. డ్యాన్స్‌లో మెరు ఇంటర్నేషనల్ స్కూల్, బాస్కెట్‌బాల్‌లో జెనెసిస్ (బాలురు), రాక్‌వెల్ (బాలికలు), ఖో–ఖోలో ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ (బాలురు), సూర్య ది గ్లోబల్ స్కూల్ బాచుపల్లి (బాలికలు) విజేతలుగా నిలిచాయి. కార్యక్రమం విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలిచింది.

## అన్నాచెల్లెళ్ల బోనాల సందడి..

## ఉట్టిపడిన తెలంగాణ సంప్రదాయ వైభవం

బోనమెత్తిన కవలలు చిన్నారులు.. తెలంగాణ సంప్రదాయానికి ప్రతిబింబంగా నిలిచిన వేడుక...

భక్తిశ్రద్ధలతో బోనమెత్తుకున్న కవలలు

బోనాల పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చిన్నారుల సందడి






కోహిర్ **ప్రజా పిలుపు ఆగస్టు 08 :** ;బోనాల పండుగ సందర్భంగా చిన్నారులైన కవలలు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై, తలపై బోనమెత్తుకుని భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. పసుపు, కుంకుమలతో సుందరంగా అందమైన పుష్పాలంకరణతో బోనం చూపరుల దృష్టిని ఆకర్షిస్తూ పండుగ శోభను మరింత పెంచింది. బోనాలను తలపై ధరించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించేందుకు సిద్ధమయ్యారు.కవల చిన్నారుల సంప్రదాయ వేషధారణ, తలపై బోనాలతో నిలిచిన దృశ్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. పండుగ సందర్భంగా పల్లవి మోడల్ స్కూల్ బృందం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నారు.అమ్మవారికి బోనం సమర్పించడం ద్వారా కుటుంబానికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శ్రేయస్సు కలగాలని ప్రార్థించారు. పుష్పాలతో అందంగా అలంకరించిన బోనాలు, సంప్రదాయ వాతావరణం పండుగ శోభను మరింత పెంచాయి.

## ప్రశాంత వాతావరణంలో బోనాలు,

## ఫలహారం బండి ఊరేగింపులు నిర్వహించాలి




గుమ్మడిదల, **ప్రజా పిలుపు ఆగస్టు 08 :** గత ఏడాది ఫలహారం బండి ఊరేగింపు సందర్భంగా ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదైన నేపథ్యంలో ఈ ఏడాది బోనాలు, ఫలహారం బండి ఊరేగింపులను ప్రశాంతంగా నిర్వహించేందుకు గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుమ్మడిదల ఎస్ఐ గ్రామస్తులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పండుగల నిర్వహణపై సూచనలు చేశారు. ఎలాంటి కుల దూషణలకు పాల్పడకుండా, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని తెలిపారు.బోనాలు, ఫలహారం బండి ఊరేగింపులను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు గ్రామస్తులు పోలీసులకు సహకరించాలని సూచించారు. పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

## ఎస్సీ బాలికలకు నూతన వసతి గృహం నిర్మించాలి



చేవెళ్ల, **ప్రజా పిలుపు ఆగస్టు 08 :** చేవెళ్లలోని ఎస్సీ బాలికల వసతి గృహానికి నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు.ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులు, వార్డెన్‌తో మాట్లాడి అక్కడ నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన వసతి గృహం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన వసతి గృహం నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

## ఆగస్టు 10 వ తేదీ ప్రజా వాణి రద్దు



**ప్రజా పిలుపు ఆగస్టు 08 :** ఈనెల 10వ తేదీ సోమవారం నాడు ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని బోనాల పండుగ సెలవు కారణంగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు.సోమవారం బోనాల పండగ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి ప్రజావాణి కార్యక్రమం కోసం 10వ తేదీ నాడు ఐడిఓసి కి రాకూడదని అన్నారు. ఆ తర్వాత సోమవారం నుండి యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం సిద్దిపేట జిల్లా వారిచే జారీ చేయడమైనది.

# ఘనంగా పండగ సాయన్న జయంతి వేడుకలు

చరిత్రపుటల్లో స్వర్ణాక్షరాలతో లిఖించిన

మహావీరుడు పండుగ సాయన్న

చరిత్ర మరచిన ఓ వీరుడి గాథ పండగ సాయన్న

తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్




జహీరాబాద్, **ప్రజా పిలుపు ఆగస్టు 08 :** జహీరాబాద్ పట్టణంలో పండగ సాయన్న 135వ జయంతిని పురస్కరించుకొని బస్టాండ్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీల నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అంతకుముందు పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ మాట్లాడుతూ రాజ్యం భ్రష్టమై అవినీతి దోపిడి అన్యాయం పెరిగినప్పుడు ప్రజల్లో నుండి వీరులు ఉద్భవిస్తారని తెలిపారు. అన్యాయాన్ని ఎదిరించి అణగారిన వర్గాలకై గొంతు ఎత్తిన మహా పురుషుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని, భారత స్వాతంత్రోద్యమ కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాటు ఉద్యమాలలో రజాకార్ల రాజ్యం కొనసాగుతూ ఉండే అప్పట్లో రజాకార్లు భూస్వాములను గుప్పెట్లో పెట్టుకొని పరిపాలన కొనసాగించారని, వారి పరిపాలనకు వ్యతిరేకంగా రజాకార్ల మీద ఉక్కు పాదం మోపిన వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని గుర్తు చేశారు. రజాకార్లకు తిరుగుబాటు చేశాడని తల నరికేశారని, రాజ్యాంగంలోని హక్కుల కోసం ప్రశ్నిస్తే దేశద్రోహులు, తీవ్రవాదులుగా ముద్ర వేస్తున్నారని, ఇది మన పాలకులు మనకు ఇస్తున్న బిరుదులని వివరించారు. ప్రశ్నిస్తే మరణమే శాసనం అనే సందేశాన్ని ఈ దేశంలోనే పాలక వ్యవస్థలు ఇస్తున్నారని, కానీ వీరులకు మరణం ఉండదని విప్లవాలకు అంతం ఉండదు...అని మరోసారి నిరూపించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పండగ సాయన్న ముదిరాజ్ జయంతిని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు ఉద్యమకారులు, నాయకులు మండల నాయకులు శంకర్, నరసింహ, గోపాల్, బాలరాజు, విజయ్, రాములు, మహమ్మద్ అలీం, సలీం, నర్సింలు ముదిరాజ్, వెంకన్న ముదిరాజ్, ప్రేమ కుమార్, అనంత్ రాం, సదానంద్ రామచందర్, ధనరాజ్, బక్కన్న, బుద్ధిష్ట్ రాహుల్, బీసీ సంఘ నాయకులు నర్సింలు ముదిరాజ్, సిద్ధార్థ్ అడ్వకేట్ రాకేష్ ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్, వెంకన్న ముదిరాజ్ తదితరాలు పాల్గొన్నారు.

## చోరీ, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలపై కఠిన చర్యలు







సంగారెడ్డి, **ప్రజా పిలుపు ఆగస్టు 08 :** చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సరైన ధ్రువీకరణ లేకుండా కొనుగోలు చేయడం, విక్రయించడం, మార్పిడి చేయడం, మరమ్మతులు చేయడం చట్టరీత్యా నేరమని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లాలోని మొబైల్ ఫోన్ వ్యాపారులు, పాత మొబైల్ ఫోన్ల విక్రయ కేంద్రాలు, మరమ్మతు కేంద్రాల నిర్వాహకులు ప్రతి మొబైల్ లావాదేవీకి ముందు కేంద్ర పరికర గుర్తింపు రిజిస్టర్ ద్వారా మొబైల్ ఫోన్ గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు.తమ వద్దకు వచ్చే ప్రతి మొబైల్ ఫోన్ గుర్తింపు సంఖ్యను నమోదు చేసి భద్రపరచాలని, మొబైల్ ఫోన్ విక్రయించే వ్యక్తి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపు కార్డు లేదా పాస్‌పోర్టు వంటి ఫొటో గుర్తింపు పత్రాలతో పాటు తాజా చిత్రాన్ని సేకరించాలని తెలిపారు. అన్ని లావాదేవీలకు సంబంధించిన బిల్లులు, యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు, రిజిస్టర్‌ను భౌతికంగా లేదా డిజిటల్ రూపంలో నిర్వహించాలని సూచించారు. నిలిపివేయబడిన మొబైల్ గుర్తింపు సంఖ్య కలిగిన ఫోన్లు, సరైన యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు లేని ఫోన్లు, చోరీకి గురైనట్లు అనుమానం ఉన్న మొబైల్ ఫోన్లతో ఎట్టి పరిస్థితుల్లోనూ లావాదేవీలు చేయరాదన్నారు. అనుమానాస్పద మొబైల్ ఫోన్ లభించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ నేరాల విభాగానికి సమాచారం అందించాలని కోరారు.చోరీకి గురైన వస్తువులను తెలిసి కొనుగోలు చేయడం లేదా తమ వద్ద ఉంచుకోవడం భారతీయ న్యాయ సంహిత–2023లోని 317వ సెక్షన్ కింద నేరమని తెలిపారు. చోరీ సొత్తును తెలిసి స్వీకరించినా లేదా తమ వద్ద ఉంచుకున్నా మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు.చోరీకి గురైన సమాచార పరికరాన్ని అది చోరీ సొత్తు అని తెలిసి లేదా తెలిసే అవకాశం ఉన్నప్పటికీ నిజాయితీ లేకుండా స్వీకరించడం లేదా తమ వద్ద ఉంచుకోవడం సమాచార సాంకేతికచట్టం–2000లోని 66బి సెక్షన్ కింద నేరమని పేర్కొన్నారు. దీనికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా రూ.లక్ష వరకు జరిమానాష్ట లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు.తనిఖీలు, దర్యాప్తు సమయంలో నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చైతన్య రెడ్డి హెచ్చరించారు. చోరీకి గురైన మొబైల్ ఫోన్ల చలామణిని అరికట్టేందుకు వ్యాపారులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

## స్కూల్ క్విజ్‌లో సావర్కర్ ప్రశ్నపై వివాదం తీవ్ర రాజకీయ దుమారం విచారణకు ఆదేశించిన ప్రభుత్వం!

కేరళలో స్కూల్ క్విజ్‌లో సావర్కర్‌పై అడిగిన ప్రశ్నతో

రాజకీయ దుమారం- బ్రిటిషర్ల చేత అత్యంత కఠిన శిక్ష

పొందిన స్వాతంత్ర్య సమరయోధుడిగా పేర్కొనడంపై

వివాదం- విచారణకు ఆదేశించిన విద్యాశాఖ మంత్రి



కేరళలోని కొన్ని పాఠశాలల్లో నిర్వహించిన ఒక క్విజ్ పోటీ తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. హిందుత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్‌ను 'బ్రిటిష్ వారి నుంచి అత్యంత తీవ్రమైన శిక్షను అనుభవించిన స్వాతంత్ర్య సమరయోధుడు' అని అభివర్ణిస్తూ ఒక ప్రశ్నాపత్రాన్ని తయారు చేయడంపై వివాదం చెలరేగింది. ఈ వ్యవహారంపై కేరళ విద్యాశాఖ మంత్రి ఎన్. షంషుద్దీన్ తీవ్రంగా స్పందించి వెంటనే విచారణకు ఆదేశించారు. అసలు ప్రశ్నల్ని ఎవరు రూపొందించారు?, క్విజ్ ఎవరు నిర్వహించారు అనే వివరాల్ని పరిశీలించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జనరల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను ఆదేశించారు.

### అసలేం జరిగింది?

ఆగస్ట్ 6న కాసరగోడ్, కుంబ్లా, మంజేశ్వర్ సబ్ డిస్ట్రిక్ట్ పరిధిలోని పాఠశాలల్లో లోయర్ ప్రైమరీ స్టూడెంట్స్‌కు ఫ్రీడమ్ క్విజ్ నిర్వహించారు. ఇందులోనే సావర్కర్‌కు సంబంధించిన ప్రశ్న ఉంది.ఇక్కడ బ్రిటిష్ వారి నుంచి అత్యంత తీవ్రమైన శిక్ష పొందిన స్వాతంత్ర్య సమరయోధుడు ఎవరు? అని ప్రశ్నించి, దానికి సమాధానంగా సావర్కర్ పేరును ఇచ్చారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో సాధారణ విద్యాశాఖ మంత్రి కార్యాలయం శనివారం రోజు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ క్విజ్ నిర్వహణ కోసం విద్యాశాఖ గానీ, సోషల్ సైన్స్ క్లబ్ గానీ ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేసింది. విద్యాశాఖ అధికారిక యాక్టివిటీ క్యాలెండర్‌లో కూడా ఈ కార్యక్రమం లేదని, అసలు ఈ క్విజ్ జనరల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అధికారిక కార్యక్రమం కాదని తెలిపింది. చారిత్రకంగా తప్పుగా ఉన్న ప్రశ్నను చేర్చిన వ్యక్తికి పక్షపాత వైఖరి ఉందని మంత్రి కార్యాలయం తెలిపింది. ప్రశ్నను రూపొందించిన వారు, క్విజ్ నిర్వహించిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ ప్రశ్నల్ని తయారు చేయడానికి, లేదా స్వతంత్రంగా పోటీని నిర్వహించడానికి తమ శాఖ ఎవరికీ అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. అయితే రిపోర్ట్స్ ప్రకారం సోషల్ సైన్స్ క్లబ్‌కు చెందిన ఉపాధ్యాయులు ఈ ప్రశ్నల్ని రూపొందించినట్లు సమాచారం ఉంది.

### వామపక్షాల తీవ్ర విమర్శలు- సంఘ్ పరివార్ అజెండానే!

ఈ వ్యవహారంపై సీపీఐ (ఎం), వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు– అధికార యూడీఎఫ్ ప్రభుత్వంపై విమర్శలు చేశాయి. విద్యా రంగంలోకి 'సంఘ్ పరివార్ అజెండా'ను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని ఆరోపించాయి. సీపీఐ (ఎం) సీనియర్ నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా స్పందించారు. యూడీఎఫ్ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్‌తో కుమ్మక్కవుతోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సావర్కర్ నిజమైన చరిత్రను దాచిపెట్టి ఆయనను గొప్పగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కేంద్రం, ఆర్ఎస్ఎస్ చరిత్రను తిరిగి రాసేందుకు ప్రయత్నిస్తున్నాయని, కేరళలో కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానాన్ని అమలు చేసే ప్రయత్నాల్లో భాగంగానే ఈ అంశాన్ని చూడాలని మండిపడ్డారు.

### సావర్కర్‌ను గొప్పగా చూయించడమేంటి?

ఇక కేరళ మాజీ జనరల్ ఎడ్యుకేషన్ మినిస్టర్ వి. శివన్‌కుట్టి కూడా ఈ ప్రశ్నపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర విద్యా రంగాన్ని కాషాయీకరణ చేసే ప్రయత్నంలో భాగమని ఆరోపించారు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రను వక్రీకరించేందుకు ఈ ప్రశ్న ద్వారా ప్రయత్నించారని విమర్శించారు. ప్రశ్న, సమాధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకా కేరళ విద్యాశాఖ– విద్యార్థులు, ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి పి.ఎస్. సంజీవ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె. సనోజ్ కూడా ప్రభుత్వాన్ని విమర్శించారు. సావర్కర్‌ను గొప్పగా చూపించే విధంగా స్కూల్ క్విజ్‌లో ప్రశ్న ఉండటాన్ని వారు తప్పుబట్టారు. ఇంకా సీనియర్ నేత, మాజీ మంత్రి ఎం.కే. మునీర్ కూడా దీనిపై స్పందించారు. సావర్కర్‌ను దేశ భక్తుడిగా చూపించడం ఆర్ఎస్ఎస్– బీజేపీ అజెండాలో భాగమని ఆరోపించారు. ఇలాంటి ప్రశ్న నిజంగానే క్విజ్‌లో ఉంటే దీనిపై తీవ్రంగా విచారణ జరిపి బాధ్యుల్ని గుర్తించాలని అన్నారు. ఇక కేరళ ప్రభుత్వం ఆదేశించిన విచారణలో క్విజ్‌ను ఎవరు రూపొందించారు, ఎవరి అనుమతితో రూపొందించారనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

## నాగార్జునసాగర్‌లో ఈ నెల 10న వరుణ యాగం

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ నిర్వహణ




హైదరాబాద్,**ప్రజా పిలుపు ఆగస్టు 08 :** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా, గోదావరి నదులు, చెరువులు జలకళ సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తం మేరకు ఈ నెల 10న నాగార్జునసాగర్‌లో వరుణ యాగం నిర్వహించనున్నారు.నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో యాగ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేదపండితులు నిర్ణయించిన ముహూర్తంలో యాగ క్రతువులను నిర్వహించనున్నారు.రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు, చెరువులు నిండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని సంకల్పిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో వరుణ యాగం జరగనుంది. యాగం అనంతరం నిర్వహించే మహా పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు.

## దేశానికి యువతే అతిపెద్ద బలం

## వారి సామర్థ్యానికి ప్రపంచంలో సాటి లేదు రాహుల్

భారత్‌కు యువతే అతిపెద్ద బలమని రాహుల్ గాంధీ వ్యాఖ్యలు- ఉద్యోగాల కొరత, పేపర్ లీక్స్‌పై తీవ్ర ఆందోళన- యువత ద్వేషం, హింసకు దూరంగా ఉండి ప్రేమతో వ్యవస్థను మార్చాలని పిలుపునిచ్చిన కాంగ్రెస్ నేత



భారతదేశానికి యువతే అతిపెద్ద బలమని, ప్రపంచంలోనే భారత యువత సామర్థ్యానికి సాటి లేదని కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. దేశంలో సుమారు 40 కోట్ల మంది యువత ఉండగా వారే అతిపెద్ద బలమని ఉద్ఘాటించారు. అమెరికా, చైనా, రష్యా వంటి దేశాల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నప్పటికీ, 21వ శతాబ్దంలో భారత యువత సామర్థ్యం వాటన్నింటికంటే గొప్పదని పేర్కొన్నారు. ప్రయాగ్ రాజ్‌లోని కేపీ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థుల గర్జన) కార్యక్రమంలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థుల్ని ఉద్దేశించి రాహుల్ గాంధీ మాట్లాడారు. యువత, డేటా, ఉద్యోగాలు, విద్య వంటి అంశాల్ని ప్రస్తావిస్తూ దేశంలోని యువత ఎదుర్కొంటున్న సమస్యలపై తన అభిప్రాయాల్ని రాహుల్ వెల్లడించారు. 'మీరు భారతదేశానికి శక్తి, గర్వకారణం. ఇక్కడ నేను ప్రతి భారతీయుడి గురించి మాట్లాడుతున్నాను.' అని రాహుల్ గాంధీ అన్నారు. ఇంకా దర్ద్ (బాధ), డేటా, దౌలత్ (సంపద) గురించి మాట్లాడాలనుకుంటున్నట్లు చెప్పి వాటి గురించి వివరించారు. ఉద్యోగాల కొరత, డేటా దోపిడీ గురించి కూడా ప్రస్తావించారు.

### అవన్నీ యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయ్!

ఉద్యోగాల కొరతను ఇక్కడ బాధగా అభివర్ణించారు. దేశంలో ప్రతి 1000 మంది యువతలో కేవలం 12 మందికి మాత్రమే శాశ్వత ఉద్యోగాలు లభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోజుల్లో విద్యార్హతల సర్టిఫికెట్లకు విలువే లేకుండా పోయిందని, ఉద్యోగాలు లభించడం లేదని విమర్శించారు. దేశంలో ఉద్యోగాల కోసం ఉన్న అన్ని తలుపులు మూసుకుపోయిన పరిస్థితి నెలకొందని అన్నారు. తయారీ రంగం క్షీణించడం, రుణాలు పొందడంలో ఇబ్బందులు, పరీక్షల పేపర్ లీకులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఉద్యోగాలపై ప్రభావం వంటి అంశాలన్నీ యువత భవిష్యత్తును దెబ్బ తీస్తున్నాయని అన్నారు.

## పీఎఫ్ అకౌంట్ ఉన్నవారికి కేంద్రం బిగ్ న్యూస్‌విత్ డ్రా రూల్స్‌లో భారీ మార్పులు కొత్త నిబంధనలు ఇవే




ఈపీఎఫ్ఓ ఖాతాదారులకు గుడ్ న్యూస్. పీఎఫ్ విత్ డ్రా నిబంధనల్లో పూర్తిగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కొత్త రూల్స్ తీసుకొచ్చింది. ఇటీవల పీఎఫ్ పాత పథకం స్థానంలో కొత్త పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇందులో మార్పులు జరిగాయి. ఈపీఎఫ్ఓ తమ ఖాతాదారులకు గుడ్ న్యూస్ తెలిపింది. పీఎఫ్ విత్ డ్రా నియమాల్లో కీలక మార్పులు చేసింది. ఉద్యోగంలో ఉన్నప్పుడే పీఎఫ్ అడ్వాన్స్ ఆప్షన్ ద్వారా మీ బ్యాలెన్స్‌లో కొంత మొత్తం తీసుకోవచ్చనే విషయం తెలిసిందే. హెల్త్ ఎమర్జెన్సీ, పెళ్లి, పిల్లల చదువులు, ఇల్లు కొనుగోలు వంటి కారణాలతో పీఎఫ్ అమౌంట్ ఉద్యోగంలో ఉన్నప్పుడే పాక్షికంగా విత్ డ్రా చేసుకోవచ్చు. వీటికి సంబంధించి తాజాగా పీఎఫ్ సంస్థ కొన్ని నిబంధనలు సడలించింది. గతంలో పీఎఫ్ అడ్వాన్స్ విత్ డ్రాకు 13 కేటగిరీలు ఉండగా.. ఇప్పుడు మూడుకు తగ్గించింది. దీంతో పాటు కాంట్రిబ్యూషన్స్, ఉద్యోగం తర్వాత పీఎఫ్ విత్ డ్రాలపై భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. అవేంటి అనేది ఇప్పుడు చూద్దాం. జూన్ 29వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం 1952 పీఎఫ్ పథకం స్థానంలో ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పథకం 2026 ప్రారంభించింది. ఇందులో పీఎఫ్ కాంట్రిబ్యూషన్, విత్ డ్రా రూల్స్ మార్చింది. ఇక నుంచి రూ.15 వేల కంటే ఎక్కువ జీతం పొందేవారు తమకు అవసరమైతే నెలవారీ కాంట్రిబ్యూషన్ పెంచుకోవచ్చు. నిబంధనల ప్రకారం తమ జీతంలో 12 శాతం పీఎఫ్‌కు అందించాలి. అంటే నెలకు రూ.1800 అందించాలి. అయితే అంతకంటే ఎక్కువ కాంట్రిబ్యూషన్ జమ చేయాలనుకుంటే స్వచ్ఛంధంగా చేయవచ్చు. అయితే ఉద్యోగి ఎక్కువ జమ చేస్తే.. యాజమాన్యం కూడా అదే మొత్తంలో చందా అందించాల్సి ఉంటుంది. అయితే అదనంగా అందించే ఈ విరాళాలను ఎప్పుడైనా మీరు నిలిపివేసుకోవడం లేదా తగ్గించుకోవడం వంటివి చేసుకోవచ్చు. ఇక గతంలో ఉద్యోగంలో ఉన్నప్పుడు పీఎఫ్ డబ్బులు విత్ డ్రా చేసుకోవాలంటే 13 కేటగిరీలు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు ఆరోగ్యం, విద్య, వివాహం వంటి కేటగిరీలు ఉన్నాయి. ఇక ఆరోగ్యం కింద మీ పీఎఫ్ బ్యాలెన్స్‌లో అర్హత గల మొత్తంలో 100 శాతం వరకు విత్ డ్రా చేసుకోవచ్చు. అయితే 12 నెలల పాటు పీఎఫ్ ఖాతాదారుడిగా కొనసాగి ఉండాలి. ఇక జీవితకాలంలో విద్య కోసం 10 సార్లు, వివాహం కోసం 5 సార్లు పాక్షికంగా ఉపసంహరించుకోవచ్చు. ఇక ఇంటి నిర్మాణం, హోమ్ లోన్ ఈఎంఐ, ఇల్లు కొనుగోలు, ఇల్లు పునరుద్దరణ వంటి అవసరాల కోసం జీవితకాలంలో 5 సార్లు మాత్రమే విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే 12 నెలల పాటు పీఎఫ్ సభ్యత్వం కలిగి ఉండాలి. ఇక ఉద్యోగం వదిలిపెట్టిన తర్వాత అమౌంట్ మొత్తం విత్ డ్రా చేసుకోలేరు. కేవలం 75 శాతం మాత్రమే విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. 12 నెలల తర్వాత మొత్తం అమౌంట్ తీసుకోవచ్చు.

## మనీ మ్యూల్ అంటే ఏమిటి? పొరపాటున ఇలా అస్సలు చేయకండి.. లేకుంటే సమస్యల్లో ఇరుక్కున్నట్లే..!



అనుకోకుండా మీరు ఇలాంటి మోసంలో చిక్కుకున్నారని అనిపించినా, లేదా మీ ఖాతాలో గుర్తుతెలియని డబ్బు జమ అయినా తక్షణమే మీ బ్యాంకును సంప్రదించి సమాచారం అందించండి. అలాగే, ఆన్‌లైన్ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా లేదా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయండి ఆధునిక డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ ఆర్థిక నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సైబర్ నేరగాళ్లు సామాన్యుల అమాయకత్వాన్ని, త్వరితగతిన డబ్బు సంపాదించాలనే ఆశను ఆసరాగా చేసుకుని కొత్త కొత్త మార్గాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఇందులో అత్యంత ప్రమాదకరమైనది "మనీ మ్యూల్" (వీశీఅవఎ వీబశ్రీవ) మోసం. దీనివల్ల బాధితులు ప్రమేయం లేకుండానే ఆర్థిక నేరాల్లో భాగస్వాములుగా మారి తీవ్ర చట్టపరమైన సమస్యల్లో చిక్కుకుంటున్నారు. దీనిపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వినియోగదారులను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పిస్తోంది. ఈ మనీ మ్యూల్ విషంలో జాగ్రత్తగా ఉండాలంటూ వాట్సాప్ ద్వారా సందేశాలను పంపుతోంది.

మనీ మ్యూల్ అంటే ఏమిటి?

సైబర్ నేరగాళ్లు, అక్రమార్కులు చట్టవిరుద్ధంగా (ఆన్‌లైన్ ఫ్రాడ్స్, సైబర్ క్రైమ్స్ లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల ద్వారా) సంపాదించిన డబ్బును నేరుగా తమ ఖాతాల్లోకి జమ చేసుకోరు. పోలీసుల నుంచి, దర్యాప్తు సంస్థల నుంచి తప్పించుకోవడానికి సాధారణ ప్రజల బ్యాంక్ ఖాతాలను ఉపయోగిస్తారు. ఇతరుల తరపున అక్రమంగా వచ్చిన డబ్బును తమ బ్యాంక్ ఖాతా ద్వారా మరొక ఖాతాకు బదిలీ చేసే లేదా విత్‌డ్రా చేసి ఇచ్చే వ్యక్తిని "మనీ మ్యూల్" అంటారు.

సైబర్ నేరగాళ్లు వేసే వలలు:

సైబర్ నేరగాళ్లు మనీ మ్యూల్స్‌ను బుట్టలో వేసుకోవడానికి రకరకాల ఆఫర్లతో ఎర వేస్తుంటారు. వర్క్ ఫ్రమ్ హోమ్ పార్ట్ టైమ్ ఉద్యోగాలకు వల వేస్తుంటారు. ఎలాంటి కష్టం లేకుండా రోజుకు కొన్ని నిమిషాలు కేటాయిస్తే వేలల్లో సంపాదించవచ్చని మెసేజ్‌లు పంపుతారు. మా ఖాతాలో ఏదో సాంకేతిక సమస్య ఉంది, మీ ఖాతాకు రూ. 50,000 పంపుతాం. అందులో రూ. 5,000 మీరు కమిషన్‌గా ఉంచుకుని మిగతా రూ. 45,000 మాకు వేరే అకౌంట్‌కి బదిలీ చేయండి అని ఆశ చూపుతారు. మీ అకౌంట్‌ను లేదా డెబిట్ కార్డ్‌ను నెలకు కొంత మొత్తం అద్దెకు ఇస్తే చాలని నమ్మిస్తారు. ఇలాంటి సమయంలో మీరు అత్యాశపడి బ్యాంక్ ఖాతాలు,కార్డ్‌లు అద్దెకు ఇవ్వకండి.

## ఫాస్ట్ ట్యాగ్ కేవలం రూ.340 చెల్లిస్తే చాలు నెల మొత్తం ఎన్ని సార్లు అయినా తిరగొచ్చు..!




ఫాస్ట్ ట్యాగ్ లోకల్ పాస్ అనేది ఒక నెలవారీ పాస్. దీని ద్వారా ఒక నిర్దిష్ట టోల్ ప్లాజా గుండా 30 రోజుల పాటు అపరిమితంగా ప్రయాణించవచ్చు. నెలకు కేవలం రూ.340 చెల్లించి, మీరు ఎటువంటి అదనపు..

ప్రతిరోజూ టోల్ ప్లాజాల గుండా ప్రయాణించే వాహనదారులకు టోల్ ఛార్జీలు గణనీయమైన ఆర్థిక భారం కావచ్చు. ఈ సమస్యను పరిష్కరించడానికి, సాధారణ ప్రయాణికులకు ఉపశమనం కల్పించడానికి, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఫాస్ట్ ట్యాగ్ లోకల్ పాస్‌ను ప్రవేశపెట్టింది. ఈ పాస్ రోజువారీ టోల్ ఖర్చులను తగ్గించి, వేలల్లో ఆదా చేసుకోవడానికి అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుంది.

ఫాస్ట్ ట్యాగ్ లోకల్ పాస్ అంటే ఏమిటి?

ఫాస్ట్ ట్యాగ్ లోకల్ పాస్ అనేది ఒక నెలవారీ పాస్. దీని ద్వారా ఒక నిర్దిష్ట టోల్ ప్లాజా గుండా 30 రోజుల పాటు అపరిమితంగా ప్రయాణించవచ్చు. నెలకు కేవలం రూ.340 చెల్లించి, మీరు ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా రోజంతా ఎన్నిసార్లయినా టోల్‌ను దాటవచ్చు. ఇది తరచుగా ప్రయాణించే వారికి ప్రత్యేకంగా ఉపయోగపడుతుంది.

సాధారణ ఫాస్ట్ ట్యాగ్ యాన్యువల్ పాస్‌తో తేడాలు:

లోకల్ పాస్ రూ.3,075 ఖర్చయ్యే ఫాస్ట్ ట్యాగ్ యాన్యువల్ పాస్ కంటే భిన్నంగా ఉంటుంది. యాన్యువల్ పాస్ 200 ట్రిప్పుల పరిమితితో వస్తుంది. ఇది రోజువారీ ప్రయాణికులకు 2-3 నెలల్లోనే అయిపోవచ్చు. లోకల్ పాస్ అపరిమిత ప్రయాణాలను అందిస్తుంది. ఇది తరచుగా టోల్‌ను దాటే వారికి మరింత ఖర్చు-సమర్థవంతమైన ఎంపిక.

ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు?

లోకల్ పాస్ కోసం దరఖాస్తు చేయడానికి కొన్ని అర్హత ప్రమాణాలు ఉన్నాయి

మీ నివాసం ఎంచుకున్న టోల్ ప్లాజాకు 20 కిలోమీటర్ల లోపు ఉండాలి.

వాహనం ప్రైవేట్ (కమర్షియల్ కాని) వాహనం అయి ఉండాలి.

వాహనం మీ పేరు మీద రిజిస్టర్ అయి ఉండాలి.

మీ =జ (రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్), ఆధార్ వివరాలు సరిపోలాలి.

చెల్లుబాటు అయ్యే ఫాస్ట్ ట్యాగ్ కలిగి ఉండాలి.

ఇది కూడా చదవండి: మహిళలకు బ్యాడ్‌న్యూస్.. భగ్గుమన్న బంగారం, వెండి ధరలు..!

## ఆగస్టు 12న నెక్స్ట్ జనరేషన్ బజాజ్ పల్సర్ గ్రాండ్ ఎంట్రీ కొత్త ఫీచర్లతో అదిరిపోయే లుక్!



పల్సర్ 125, 124.38ఏఏ సింగిల్-సిలిండర్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది 11.8శ్రా పవర్, 10.8చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. మరోవైపు పల్సర్ 150 149.5ఏఏ సింగిల్-సిలిండర్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది 14శ్రా పవర్, 13.4చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ రెండు బైక్‌లకు.. బజాజ్ ఆటో త్వరలో తన పల్సర్ సిరీస్‌కు ఒక కొత్త బైక్‌ను జోడించడానికి సిద్ధమవుతోంది. ఈ కంపెనీ 2026 ఆగస్టు 12న ఒక కొత్త పల్సర్ బైక్‌ను ఆవిష్కరించనుంది. ప్రస్తుతం అది ఏ మోడల్ అవుతుంది లేదా అది ఎలాంటి ప్రత్యేక ఫీచర్లను అందిస్తుంది అనే విషయాన్ని కంపెనీ వెల్లడించలేదు. అయితే, అది కొత్త బజాజ్ పల్సర్ చీ160 అయి ఉండవచ్చని భావిస్తున్నారు. కంపెనీ కొత్త పల్సర్ 125 లేదా తర్వాతి జనరేషన్ పల్సర్ 150ని కూడా పరిచయం చేయవచ్చని ప్రచారం జరుగుతోంది. నిజానికి ఖీ27 మొదటి త్రైమాసిక ఫలితాల సందర్భంగా, బజాజ్ ఆటో రాబోయే వారాల్లో 10 కొత్త మోటార్‌సైకిళ్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త లైనప్‌లో 125ఏఏ, 150ఏఏ సెగ్మెంట్‌లలో బైక్‌లు ఉంటాయి. అందువల్ల ఆగస్టు 12న రాబోయే బైక్ ఈ మోడళ్లలో ఒకటి కావచ్చు.

**బైక్ కొత్త లుక్‌తో వస్తుందా?**

కొత్త పల్సర్ టెస్ట్ మోడల్ ఒకటి ఇటీవల రోడ్డుపై కనిపించింది. దాని డిజైన్‌లో అనేక మార్పులు జరిగినట్లు తెలుస్తోంది. ఈ బైక్‌లో మునుపటి కంటే మరింత దృఢమైన ఫ్యూయల్ ట్యాంక్, పెద్ద ఫ్రంట్ కౌల్ ఉంటాయని అంచనా. అంతేకాకుండా, ట్యాంక్‌కు ఇరువైపులా పెద్ద ఎక్స్‌టెన్షన్లు, పొడవైన సీటు, నిటారుగా ఉండే సీటింగ్ డిజైన్ కూడా ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ బైక్‌లో అల్లాయ్ వీల్స్, సైడ్-మౌంటెడ్ ఎగ్జాస్ట్ కూడా ఉండవచ్చు. మొత్తంమీద దీని డిజైన్ ప్రస్తుత మోడల్ కంటే మరింత స్పోర్టీగా, శక్తివంతంగా కనిపిస్తుందని అంచనా.

**స్మార్ట్ ఫీచర్స్**

కొత్త పల్సర్ 125, పల్సర్ 150 కూడా ఫీచర్ అప్‌డేట్‌లను అందుకోనున్నాయి. ఈ బైక్‌లలో పూర్తిగా డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఉండవచ్చు. ఇందులో బ్లూటూత్ కనెక్టివిటీతో పాటు, కాల్ అలర్ట్‌లు, టర్న్-బై-టర్న్ నావిగేషన్ వంటి ఫీచర్లు కూడా ఉండవచ్చు.

**ఇంజన్‌లో పెద్ద మార్పులు జరిగే అవకాశం లేదు:**

పల్సర్ 125, 124.38ఏఏ సింగిల్-సిలిండర్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది 11.8శ్రా పవర్, 10.8చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. మరోవైపు పల్సర్ 150 149.5 సింగిల్-సిలిండర్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది 14శ్రా పవర్, 13.4చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ రెండు బైక్‌లకు 5-స్పీడ్ గేర్‌బాక్స్, ఎలక్ట్రానిక్ ఫ్యూయల్ ఇంజెక్షన్ జత చేశారు. కొత్త పల్సర్‌లో బజాజ్ ఎన్ని మార్పులు చేస్తుందనేది ఆగస్టు 12న మాత్రమే స్పష్టమవుతుంది.

## జియో కస్టమర్లకు పండగే 15 ప్రీమియం OTTలు, 1000o లైవ్ ఛానెళ్లతో సరికొత్త ఓటీటీ పాస్‌లు




జీఅశీ: కొత్తగా ప్రవేశపెట్టిన ఈ రీఛార్జ్ ప్లాన్లను జియో ఓటీటీ-పాస్‌లు మైజియో (వీఎజీఅశీ) యాప్, అధికారిక జియో వెబ్‌సైట్, రీటైల్ అవుట్‌లెట్ల ద్వారా రీఛార్జ్ చేసుకోవడానికి అందుబాటులో ఉన్నాయి. ప్రతి జియో ఓటీటీ-పాస్ ద్వారా ప్రతినెల రూ. 1,500 విలువైన ప్రయోజనాలు లభిస్తాయి. ఇందులో వినియోగదారుల్లో ఎంతో ఆదరణ పొందిన 'జియో ఓటీటీ-పాస్' (జీఅశీ ూు-ూఖం) పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తూ రిలయన్స్ జియో సరికొత్తగా 3 నెలల (త్రైమాసిక), 1 సంవత్సరం (వార్షిక) వ్యాలిడిటీ ప్లాన్లను ప్రకటించింది. వినియోగదారులకు మరింత ఎక్కువ డేటా, నిరంతరాయంగా ప్రీమియం వినోదాన్ని తక్కువ ఖర్చుతో అందించడమే లక్ష్యంగా ఈ కొత్త ప్లాన్లను అందుబాటులోకి తెచ్చింది.

**వివిధ అవసరాలకు అనుగుణంగా ప్రవేశపెట్టిన ప్లాన్ల వివరాలు:**

రూ. 200 ఓటీటీ పాస్: 28 రోజుల వ్యాలిడిటీతో 30 జీబీ హై-స్పీడ్ డేటా, అన్‌లిమిటెడ్ 5జీ లభిస్తుంది. (కేవలం వాయిస్ ప్యాక్‌లు మినహా) యాక్టివ్ బేస్ ప్లాన్ ఉన్న వారికి.

కొత్త రూ. 550 ఓటీటీ పాస్: 84 రోజుల వ్యాలిడిటీతో 90 జీబీ హై-స్పీడ్ డేటా, అన్‌లిమిటెడ్ 5జీ లభిస్తుంది. 3 నెలలు లేదా 1 సంవత్సరం బేస్ ప్లాన్ ఉన్నవారికి ఇది వర్తిస్తుంది.

కొత్త రూ. 2000 ఓటీటీ పాస్: 365 రోజుల వ్యాలిడిటీతో 365 జీబీ హై-స్పీడ్ డేటా, అన్‌లిమిటెడ్ 5జీ లభిస్తుంది. 1 సంవత్సరం బేస్ ప్లాన్ ఉన్న చందాదారులకు ఇది ప్రత్యేకంగా అందుబాటులో ఉంటుంది.

**ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజీ:**

ప్రతి జియో ఓటీటీ-పాస్ ద్వారా ప్రతినెల రూ. 1,500 విలువైన ప్రయోజనాలు లభిస్తాయి. ఇందులో 15 ప్రీమియం ఓటీటీ యాప్‌లు, జియోటీవీ యాప్ ద్వారా 1,000కి పైగా లైవ్ టీవీ ఛానెళ్ల ప్రసారాలు నిరంతరాయంగా వీక్షించవచ్చు.

**ముఖ్యమైన విశేషాలు:**

యూట్యూబ్ ప్రీమియం: టీవీ, ట్యాబ్, మొబైల్‌లలో ప్రకటనలు లేని స్ట్రీమింగ్, బ్యాక్‌గ్రౌండ్ ప్లే, ఆఫ్‌లైన్ డౌన్‌లోడ్ సౌకర్యం.

జియోహాట్‌స్టార్ మొబైల్ o హాలీవుడ్: లైవ్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ ఒరిజినల్స్, హాలీవుడ్ సినిమాల వీక్షణ.

అమెజాన్ ప్రైమ్: రూ. 550, రూ. 2000 పాస్‌లపై అమెజాన్ ప్రైమ్ లైట్; రూ. 200 పాస్‌పై ప్రైమ్ వీడియో మొబైల్ ఎడిషన్ లభిస్తాయి.

12 ఇతర ప్రీమియం యాప్‌లు: సోనీ లివ్, జీ5, లయన్స్ గేట్ ప్లే, డిస్కవరీం, సన్ నెక్స్ట్, ఫ్యాన్‌కోడ్, హోయ్‌చోయ్, చౌపాల్, ప్లానెట్ మరాఠీ, కంచా లంకా, టైమ్స్ ప్లే, తరంగ్ ప్లస్ యాప్‌లను జియోటీవీ ద్వారా వీక్షించవచ్చు.

1000o లైవ్ టీవీ ఛానెళ్లు: స్టార్ ప్లస్ హెచ్‌డీ, కలర్స్ హెచ్‌డీ, సెట్ హెచ్‌డీ, సన్ టీవీ హెచ్‌డీ, డిస్కవరీ, కార్టూన్ నెట్‌వర్క్ వంటి ప్రముఖ ఛానెళ్లు అందుబాటులో ఉంటాయి.

కొత్తగా ప్రవేశపెట్టిన రూ. 550, రూ. 2000 జియో ఓటీటీ-పాస్‌లు మైజియో (వీఎజీఅశీ) యాప్, అధికారిక జియో వెబ్‌సైట్, రీటైల్ అవుట్‌లెట్ల ద్వారా రీఛార్జ్ చేసుకోవడానికి అందుబాటులో ఉన్నాయి.

## అలా అయితే వీలునామా చెల్లదా.అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల ఆస్తి పంపిణీలో అసలు నిజాలు తెలుసుకోండి

తల్లిదండ్రులు మరణించాక ఆస్తుల పంపిణీ విషయంలో కుటుంబాల్లో గొడవలు జరగడం సాధారణమే. ముఖ్యంగా తండ్రి రాసిపెట్టిన వీలునామా రిజిస్టర్ కాకపోతే, అది చెల్లకుండా పోతుందని.. ఆ ఆస్తిపై కొడుకులు, కూతుళ్లకు సమాన హక్కులు వచ్చేస్తాయని చాలామంది భావిస్తుంటారు. అయితే ఈ విషయంలో చట్టం ఏం చెప్తుందో తెలుసుకోండి.. తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత ఆస్తుల పంపిణీ విషయంలో చాలా కుటుంబాల్లో వివాదాలు రావడం సహజం. ముఖ్యంగా తండ్రి రాసి వీలునామా రిజిస్టర్ కాకపోతే, దానికి అసలు చట్టబద్ధతే ఉండదని చాలామంది భావిస్తుంటారు. అయితే భారత వారసత్వ చట్టాల ప్రకారం ఇది పూర్తిగా అపోహ మాత్రమేనని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇటీవల ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఒక వ్యక్తి అడిగిన ప్రశ్నకు న్యాయ నిపుణులు ఇచ్చిన స్పష్టత ఇవ్వడంతో రిజిస్టర్ కాని వీలునామా చెల్లుబాటు, ఆస్తిపై కొడుకులు, కూతుళ్ల హక్కుల గురించి కొన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

**తండ్రి వీలునామా కూతుళ్ల కోర్టు పిటిషన్**

బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన తండ్రి 2022లో మరణించారు. ఆయనకు ఐదుగురు కొడుకులు, ఆరుగురు కూతుళ్లు ఉన్నారు. తండ్రి తన సొంత సంపాదనతో కొన్న ఆస్తిపై ఒక వీలునామా రాసి పెట్టారు.. కానీ దాన్ని రిజిస్టర్ చేయలేదు. అయితే 2024లో కూతుళ్లు హిందూ వారసత్వ చట్టం 2005 ప్రకారం తమకు ఆస్తిలో సమాన వాటా కావాలని కోర్టును ఆశ్రయించారు. పంపిణీ కాని ఈ ఆస్తిపై నిపుణులు ఏం చెప్పారంటే..

**రిజిస్ట్రేషన్ లేకపోతే విల్లు చెల్లాచెదురవుతుందా?**

భారత వారసత్వ చట్టం 1925 ప్రకారం వీలునామా రిజిస్ట్రేషన్ తప్పనిసరి కాదు. సరిగ్గా రాసి, ఇద్దరు సాక్షుల సమక్షంలో సంతకాలు జరిగితే, రిజిస్టర్ కాని విల్లు కూడా చట్టబద్ధంగా సంపూర్ణంగా చెల్లుబాటు అవుతుంది. అయితే ఆ వీలునామా బలవంతంగా రాయించారని, ఫోర్జరీ అని లేదా రాసే సమయంలో తండ్రి మానసిక స్థితి సరిగ్గా లేదని కోర్టులో నిరూపిస్తే తప్ప సాధారణ పరిస్థితుల్లో ఆ రిజిస్టర్ కాని వీలునామా ఆధారంగానే ఆస్తి పంపిణీ జరుగుతుంది.

**సొంత సంపాదన ఙం పిత్రార్జిత ఆస్తి**

ఈ కేసులో మరో ముఖ్యమైన అంశం ఏంటంటే.. సదరు తండ్రి ఆస్తి తన సొంత సంపాదనతో సంపాదించింది.




స్వయంకార్జిత ఆస్తి: ఒక వ్యక్తి తన సొంత డబ్బుతో కొనుగోలు చేసిన ఆస్తిపై ఆయనకు పూర్తి హక్కులు ఉంటాయి. దానిని విల్లు ద్వారా తనకు నచ్చిన వారికి రాసిచ్చే పూర్తి చట్టబద్ధమైన అధికారం ఆయనకు ఉంటుంది.

పిత్రార్జిత ఆస్తి: ఇది తాతముత్తాతల నుండి వారసత్వంగా వచ్చే ఆస్తి. దీనికి మాత్రమే ఉమ్మడి కుటుంబ చట్టాలు వర్తిస్తాయి.

**హిందూ వారసత్వ చట్టం 2005 ప్రకారం కూతుళ్ల హక్కులు**

హిందూ వారసత్వ (సవరణ) చట్టం 2005 ప్రకారం కూతుళ్లకు పుట్టుకతోనే తండ్రి పిత్రార్జిత ఆస్తిలో కొడుకులతో సమానంగా హక్కు లభిస్తుంది. అయితే చెల్లుబాటు అయ్యే వీలునామా ఉన్నప్పుడు మాత్రం ఆస్తి పంపిణీ వీలునామాలో రాసిన నిబంధనల ప్రకారమే జరుగుతుంది. ఒకవేళ వీలునామాలో కూతుళ్లకు వాటా కేటాయిస్తే వారు దానిని పొందవచ్చు. వీలునామా అంశాలపై అనుమానాలు ఉంటే వారు కోర్టులో సవాలు చేసే హక్కు కూడా కూతుళ్లకు ఉంటుంది.

**వీలునామా లేని ఆస్తి పరిస్థితి ఏమిటి?**

ఒకవేళ తండ్రి రాసిన విల్లులో ఆయనకున్న మొత్తం ఆస్తుల ప్రస్తావన లేకుండా కేవలం కొన్ని ఆస్తుల గురించే ఉంటే.. మిగిలిన ఆస్తులను ఇంటెస్టేట్ ప్రాపర్టీగా పరిగణిస్తారు. అలా మిగిలిపోయిన ఆస్తులపై హిందూ వారసత్వ చట్టం 1956 ప్రకారం క్లాస్ 1 వారసులైన కొడుకులు, కూతుళ్లు, భార్య, తల్లి అందరికీ సమాన హక్కులు లభిస్తాయి.

# భారత్?కు మరో షాక్- గాయంతో స్టార్ బ్యాటర్ సిరీస్ నుంచి ఔట్!

**భారత్ - శ్రీలంక టెస్టు సిరీస్ - ప్రారంభానికి ముందు టీమ్ఇండియాకు మరో షాక్- గాయం కారణంగా స్టార్ బ్యాటర్ దూరం!**



శ్రీలంకతో టెస్టు సిరీస్ ప్రారంభానికి ముందే భారత్?కు మరో పెద్ద షాక్ తగిలింది. గాయం కారణంగా సాయి సుదర్శన్ ఈ సిరీస్?కు దాదాపు దూరమైనట్లు క్రీడావర్గాలు పేర్కొన్నాయి. నిర్ణీత సమయంలో గాయం నుంచి పూర్తిగా రికవరీ అవ్వడంలో సుదర్శన్? విఫలమైనట్లు తెలిసింది. దీంతో మేనేజ్?మెంట్ అతడిని ఈ సిరీస్ నుంచి తప్పించినట్లు సమాచారం అందింది. త్వరలోనే అతడి స్థానాన్ని మరో ఆటగాడితో భర్తీ చేసే అవకాశం ఉంది. అయితే శ్రీలంక పర్యటన కోసం ఇటీవల టీమ్ఇండియా మేనేజ్?మెంట్ ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో సుదర్శన్ ఉన్నాడు. కానీ, కాలికి గాయం కారణంగా అతడు ఫిట్?నెస్ నిరూపించుకోవడంపైనే సిరీస్?లో ఆడడం అధారపడి ఉంది. ఈ మేరకు అతడికి మేనేజ్?మెంట్ కొంత సమయం ఇచ్చింది. ఇక ఇప్పటికే ఈ సిరీస్? నుంచి స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా కూడా ఫిట్?నెస్ కారణంగా వైదొలిగాడు. అతని స్థానంలో ఆకిబ్ నబీని జట్టులోకి తీసుకున్నారు. ఇప్పుడు సుదర్శన్ కూడా దాదాపు దూరం అయ్యాడు!

## గతనెల గాయం!

కాగా, సుదర్శన్? భారత్ ఌ జట్టుతో జూన్?లో శ్రీలంక పర్యటనకు వెళ్లాడు. అక్కడ ఆతిథ్య శ్రీలంక ఌ జట్టుతో భారత్ రెండు అనధికారక టెస్టులు ఆడింది. ఇందులో సుదర్శన్ అద్భుతమైన బ్యాటింగ్?తో రాణించాడు. రెండు టెస్టుల్లో రెండు సెంచరీలు నమోదు చేశాడు. రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్?లో అయితే 168 పరుగులుతో అదరగొట్టాడు. ఈ మ్యాచ్?లోనే అతడు గాయపడ్డాడు. అప్పట్నుంచి బెంగళూరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్?లో రికవరీ అవుతున్నాడు. ఇందులో తొలి మ్యాచ్ డ్రాగా ముగియగా, రెండు టెస్టుల్లో భారత్ 10 వికెట్ల తేడాతో నెగ్గింది.

## మూడో స్థానంలో పడిక్కల్

సుదర్శన్ ఫిట్‌గా ఉంటే, అతడు మూడో స్థానంలో బరిలోకి దిగేవాడు. కానీ ఇప్పుడు సిరీస్?కు దూరమవ్వడం వల్ల ఆ స్థానం కోసం ఇంకొకరి పేరు పరిశీలించాల్సి ఉంది. ప్రస్తుతం భారత జట్టు శ్రీలంక ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతోంది. ఈ మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేసి అద్భుతమైన సెంచరీ సాధించాడు. దీంతో ఆ స్థానంలో పడిక్కల్?ను బరిలో దింపే అవకాశం ఉంది. పడిక్కల్ శ్రీలంక స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని, 121 బంతుల్లో 103 పరుగులు చేసి రిటైర్ అయ్యాడు. టీ విరామ సమయానికి భారత్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (29లి), మానవ్ సుతార్ (3లి) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓపెనర్ యశస్వీ జైస్వాల్ డకౌట్ కాగా, రిషబ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (1) స్వల్ప స్కోర్లకే పెవిలియన్?కు చేరారు. కేఎల్ రాహుల్ (40 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. అంతకుముందు శ్రీలంక జట్టు 363-8 స్కోరు వద్ద తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

## శుభ్‌మన్ గిల్‌కు కూడా గాయం

టీమ్ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా గాయంతో బాధపడుతున్నాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌కు ముందు రోజు (గురువారం) నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు బంతి తగలడంతో గిల్ వేలికి గాయమైంది. దీనివల్ల అతడు శుక్రవారం ప్రారంభమైన ప్రాక్టీస్ మ్యాచ్?లో దిగలేదు. గిల్ స్థానంలో కేఎల్ రాహుల్ ప్రాక్టీస్ మ్యాచ్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇక ఈరోజు గిల్ బ్యాటింగ్ చేయడానికి వస్తాడని భావించినప్పటికీ, నాలుగు వికెట్లు పడిన తర్వాత కూడా క్రీజులోకి రాలేదు. దీంతో అతని గాయం తీవ్రతపై అభిమానుల్లో ఆందోళన నెలకొంది. మొదటి టెస్టులో ఆడతాడా? లేదా అని కంగారు మొదలైంది. అయితే ఈ విషయంపై బీసీసీఐ ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# ‘పంత్?కు ఏం కావాలన్నా ఇస్తాం ఉత్తరాఖండ్?కు వెల్?కమ్’ CM పుష్కర్ సింగ్ ధామి

**అర్ధరాత్రి వేళ రిషబ్ పంత్ ట్వీట్ సంచలనం ఇల్లు కట్టుకోవడానికి స్థలం కావాలంటూ సీఎంకు రిక్వెస్ట్ స్పందించిన ముఖ్యమంత్రి ధామి**



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ రిషబ్ పంత్ అర్ధరాత్రి చేసిన ట్వీట్?కు ఉత్తరాఖండ్? ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. ఉత్తరాఖండ్?లో తనకు ఇల్లు నిర్మించుకునేందుకు భూమిని కేటాయించాల్సిందిగా కోరుతూ పంత్ చేసిన ట్వీట్?కు సీఎం ధామి మొదట ఎక్స్?లో రెస్పాండ్ అయ్యారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ పంత్ విజ్ఞప్తి చేస్తూ పోస్ట్ చేసిన ట్వీట్?ను ప్రస్తావించారు. ఉత్తరాఖండ్?కు రావాలనుకున్న వాళ్లకు తమ ప్రభుత్వం స్వాగతం పలుకుతుందని అన్నారు. ‘ఇక్కడికి ఎవరు రావాలనుకున్నా మేం వాళ్లకు స్వాగతం పలుకుతాం. అన్నింటికంటే ముఖ్యంగా పంత్ మా రాష్ట్రానికి చెందిన బిడ్డ. ఆయన తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు రాష్ట్రానికి కూడా మంచి పేరు తెచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో మన భారత్?కు కూడా అనేక విజయాలు అందించాడు. అతడికి మేం ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతాం. దీనిపై ఇప్పటికే నేను మా అధికారులతో మాట్లాడాను. అతడికి ఏం కావాలన్నా అందించడానికి మేం సిద్ధంగా ఉన్నాం’ అని ధామి జాతీయ మీడియాతో పేర్కొన్నారు.

## ఇంతకీ ఏం జరిగింది?

పంత్ ప్రస్తుతం శ్రీలంక పర్యటనలో ఉన్నాడు. అయితే శనివారం అర్ధరాత్రి 12:46 గంటలకు ఆతడి అధికారిక ఎక్స్ అకౌంట్ నుంచి ఓ సంచలన ట్వీట్ వచ్చింది. దీనికి సీఎం పుష్కర్ సింగ్ ధామిని ట్యాగ్ చేస్తూ, “నమస్కారం సార్! ఎలా ఉన్నారు? నేను ఉత్తరాఖండ్‌కు చెందినవాడినైనప్పటికీ, చాలా కాలంగా రాష్ట్రం బయట నివసిస్తున్నాను. అయితే ఇప్పుడు నా సొంత రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో స్థిరపడాలని అనుకుంటున్నాను. గత మూడేళ్లుగా తగినంత స్థలం ఉన్న అనువైన భూమి కోసం ప్రయత్నిస్తున్నాను, కానీ ఇప్పటివరకు సరైన స్థలం దొరకలేదు. నాకు మన రాష్ట్రం అంటే చాలా ఇష్టం. అందుకే ఇల్లు కట్టుకోవడానికి భూమి కోసం మీ సహాయాన్ని కోరుతున్నాను’ ‘నాకు గతంలో కేటాయించాల్సి ఉన్న భూమికి సంబంధించిన విషయం కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉంది. నా సొంత ప్రాంత అభివృద్ధికి నేను నా వంతు కృషి చేయాలనుకుంటున్నాను. దయచేసి ఈ విషయాన్ని సీరియస్‌గా పరిశీలించాలని మిమ్మల్ని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. మీ స్పందన కోసం ఎదురుచూస్తుంటాను. అంతర్జాతీయ వేదికలపై మన రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు ప్రభుత్వం నాకు భూమిని కేటాయిస్తే చాలా సంతోషిస్తాను. మీరు అనుమతిస్తే, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే భూమిని కొనుగోలు చేయడానికి కూడా నేను సిద్ధంగా ఉన్నాను. దయచేసి సహాయం చేయండి’ అని పంత్? రెండు వేర్వేరు పోస్టుల్లో రాసుకొచ్చాడు. ఈ ట్వీట్?కు ముఖ్యమంత్రి స్పందిస్తూ, “రిషబ్ పంత్, నువ్వు ఉత్తరాఖండ్ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచావు. నీ అద్భుతమైన ప్రదర్శన, విజయాలతో ‘దేవభూమి’ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా పెంచావు. మాతృభూమిపై నీకున్న ప్రేమ, దాని అభివృద్ధికి తోడ్పడాలనే నీ తపన నిజంగా ప్రశంసనీయం. నీ విషయంలో నేను అధికారులతో మాట్లాడతాను. వారు త్వరలోనే నిన్ను సంప్రదిస్తారు” అని సీఎం ధామి ఉదయం 8:54 గంటలకు రిప్లై ఇచ్చారు.

## నిజంగానే పంత్ ట్వీట్ చేశాడా?

అయితే సీఎం ధామి స్పందించడం అటుంచితే, అసలు ఈ ట్వీట్ నిజంగా రిషభ్ పంత్ చేశాడా? అని నెటిజన్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అకౌంట్? అతడిదే అయినప్పటికీ హ్యాక్ అయి ఉండవచ్చని భావిస్తున్నారు. ఎందుకంటే ఆ ట్వీట్?లో స్పెల్లింగ్ మిస్టేక్స్ ఉండడం, అంతేకాకుండా పంత్?లాంటి స్టార్ ఆటగాడు స్థలం కావాలని విజ్ఞప్తి చేయడంతో ఇది నమ్మశక్యంగా లేదని అంటున్నారు. అయితే దీనిపై స్వయంగా పంత్ స్పందిస్తేనే క్లారిటీ వస్తుంది

# ధోని అసలు పేరేంటో తెలుసా? స్కూల్ సర్టిఫికెట్‌లో జరిగిన తప్పుతో పేరు మార్చుకున్నాడు






**మహేంద్ర సింగ్ ధోని అసలు ఇంటిపేరు ‘ధౌని’ అని చెబుతారు. అయితే స్కూల్ సర్టిఫికెట్‌లో జరిగిన స్పెల్లింగ్ తప్పిదంతో అది ‘ధోని’గా మారింది. అదే పేరు తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. చిన్ననాట ఫుట్‌బాల్ గోల్‌కీపర్‌గా ఉన్న ధోని, కోచ్ సూచనతో క్రికెట్‌లోకి వచ్చారు. రైల్వే ఉద్యోగం చేస్తూనే క్రికెట్ కొనసాగించి, చివరకు టీమిండియా కెప్టెన్‌గా ఎదిగారు.**

టీమిండియా మాజీ కెప్టెన్, క్రికెట్ ప్రపంచంలో ‘కెప్టెన్ కూల్’గా గుర్తింపు పొందిన మహేంద్ర సింగ్ ధోని పేరు వెనుక ఆసక్తికరమైన కథ ఉంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులకు ధోనిగా తెలిసిన ఈ క్రికెటర్ కుటుంబ ఇంటిపేరు అసలు అది కాదు. స్కూల్ సర్టిఫికెట్లలో జరిగిన ఓ స్పెల్లింగ్ తప్పిదం.. అతని జీవితంలో అసలు పేరుకు బదులు నకిలీ పేరుతోనే పాపులర్ అయ్యాడు. ఇంతకీ ధోని అసలు పేరుంటో ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. మహేంద్ర సింగ్ ధోని 1981 జూలై 7న అప్పటి బిహార్‌లోని రాంచీలో జన్మించారు. ప్రస్తుతం రాంచీ జార్ఖండ్‌లో ఉంది. ఆయన తండ్రి పాన్ సింగ్, తల్లి దేవకీ దేవి. కుటుంబ మూలాలు ప్రస్తుత ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లా ల్వాలీ గ్రామంతో సంబంధం కలిగి ఉన్నాయి. ధోని ముగ్గురు సంతానంలో చిన్నవాడు. కాగా వీళ్ల ఇంటి పేరు ధోని కాదు ధౌని.

## స్కూల్ సర్టిఫికెట్‌లో స్పెల్లింగ్ తప్పు

ధోని పేరు ‘ధౌని’ నుంచి ‘ధోని’గా మారడానికి కారణం స్కూల్ రికార్డుల్లో జరిగిన స్పెల్లింగ్ పొరపాటుగా చెబుతారు. రాంచీలోని ఌూఎ జవహర్ విద్యా మందిర్‌లో చదువుతున్న సమయంలో ఆయన ఇంటిపేరు ‘ఇఞ్ఘుబఅఱ’కి బదులుగా ‘ఇఞ్ఘశీఅఱ’గా నమోదైంది. కుటుంబ సభ్యులు ఆ తప్పును సరిచేయడానికి ప్రయత్నించినప్పటికీ, అది అధికారికంగా మారలేదు. చివరకు అదే స్పెల్లింగ్ ఆయన విద్యా రికార్డుల్లో కొనసాగి, క్రికెట్ ప్రపంచంలోనూ ధోనిగా స్థిరపడింది.

## మొదట క్రికెటర్ కాదు.. ఫుట్‌బాల్ గోల్‌కీపర్!

చిన్నతనంలో ధోనికి క్రికెట్ కంటే ఫుట్‌బాల్‌పై ఆసక్తి ఎక్కువగా ఉండేది. స్కూల్ ఫుట్‌బాల్ జట్టులో ఆయన గోల్‌కీపర్‌గా ఆడేవారు. అయితే ఆయన ప్రతిభను గమనించిన క్రికెట్ కోచ్ కేశవ్ బెనర్జీ, క్రికెట్‌లో వికెట్ కీపర్‌గా ప్రయత్నించాలని సూచించారు. ఆ నిర్ణయమే ఆయన జీవితాన్ని పూర్తిగా మార్చేసింది.

## స్థానిక క్రికెట్ నుంచి రైల్వేస్ వరకు

వికెట్ కీపర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ధోని కమాండో క్రికెట్ క్లబ్, అనంతరం జజా జట్టు తరపున ఆడారు. ప్రతిభను మెరుగుపరుచుకుంటూ దేశవాళీ క్రికెట్‌లోకి అడుగుపెట్టారు. అయితే టీమిండియాలోకి వెంటనే అవకాశం రాలేదు. క్రికెట్‌తో పాటు జీవనోపాధి కోసం రైల్వేలో ఉద్యోగం కూడా చేశారు. 2001 నుంచి 2003 వరకు ఖరగ్‌పూర్‌లో ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్‌గా పనిచేశారు.

## రైల్వే ఉద్యోగం నుంచి టీమిండియా కెప్టెన్‌గా..

రైల్వే ఉద్యోగం చేస్తున్నప్పటికీ ధోని క్రికెట్‌ను మాత్రం వదల్లేదు. దేశవాళీ మ్యాచ్‌లలో మెరుగైన ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించారు. 2004లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆయన.. అద్భుతమైన బ్యాటింగ్, వికెట్ కీపింగ్‌తో తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

## ధోని పేరుతో చరిత్ర సృష్టించాడు

ఆ తర్వాతి కథ భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేక అధ్యాయం. ధోని నాయకత్వంలో భారత్ 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ గెలిచింది. ఒక చిన్న స్కూల్ స్పెల్లింగ్ తప్పిదంతో ‘ధౌని’ నుంచి ‘ధోని’గా మారిన పేరు..

# స్పోర్ట్స్

## ఫిఫా వరల్డ్?కప్?లో మెస్సి హత్యకు కుట్ర బాంబుతో పేల్చేయాలని ప్లాన్!

**2026 ఫిఫా ప్రపంచ కప్?పై ఉగ్ర కుట్ర- అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సి హత్యకు ప్లాన్ చేసినట్లు స్పానిష్ మీడియాలో కథనాలు**



2026 ఫిఫా వరల్డ్?కప్ ముగిసిన రెండు వారాల తర్వాత సంచలన నివేదిక ఒకటి బయటకు వచ్చింది. ప్రపంచ కప్ సమయంలో అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సితోపాటు పోర్చుగల్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డోతో సహా అనేక మందిని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద దాడికి ప్రణాళిక వేసినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. అర్జెంటీనా జట్టు కెప్టెన్ మెస్సిని హత్య చేయడానికి ఉగ్రవాద బృందాలు ప్రయత్నించాయని స్పానిష్ వార్తాపత్రిక తన కథనంలో పేర్కొంది. ఈ కుట్రపై అమెరికా పోలీసులకు సమాచారం ఉందని అందులో పేర్కొంది. అయితే, ఎఫ్‌బీఐ, అంతర్జాతీయ భద్రతా బృందం ఈ సంఘటనను సమర్థవంతంగా ఎదుర్కొని, అవాంఛనీయ సంఘటన జరగకుండా నిరోధించింది. స్పానిష్ మీడియా సంస్థ నివేదిక ప్రకారం, యునైటెడ్ స్టేట్స్‌తో సహా టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్లకు అనేక ఉగ్రవాద బెదిరింపులు వచ్చాయి. అర్జెంటీనా స్టార్ మెస్సికి అత్యధిక బెదిరింపులు వచ్చాయి. ఒక అనుమానితుడు మెస్సిని లక్ష్యంగా చేసుకుని తన సోషల్ మీడియా ఖాతాలో ఒక సందేశాన్ని పోస్ట్ చేశాడు. “నా శరీరానికి నాలుగు బాంబులు కట్టుకుని అట్లాంటా స్టేడియానికి నడిచి వెళ్లి మెస్సిని పేల్చివేస్తాను” అని పోలీసు రికార్డులను ఉటంకిస్తూ ఒక నివేదిక పేర్కొంది. అయితే ఆ అనుమానితుడు ఆ తర్వాత ఆ సందేశాన్ని తొలగించాడు. మరో కేసులో, ఒక గుర్తు తెలియని వ్యక్తి డాలస్ విమానాశ్రయానికి ఫోన్ చేసి, తాను ఌ=-15 రైఫిల్, ఇంట్లో తయారు చేసిన బాంబులతో స్టేడియానికి వెళ్తున్నానని చెప్పాడు. అతను మెస్సితో పాటు ఇతర క్రీడాకారులు, పోలీసు అధికారులను పేల్చివేస్తానని బెదిరించాడు. అనుమానితుల జాబితాలో మెస్సితో పాటు క్రిస్టియానో రొనాల్డో కూడా ఉన్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. జూన్ 14న, పోర్చుగీస్ ఫుట్‌బాల్ క్రీడాకారులు బస చేస్తున్న హోటల్‌కు ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పరిస్థితి గురించి సమాచారం కోరినట్లు ఒక అధికారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. క్రీడాకారుల హోటల్, స్టేడియాల సమీపంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు స్పానిష్ వార్తాపత్రిక వెల్లడించింది. బెదిరింపులు కేవలం క్రీడాకారులకే కాకుండా మ్యాచ్ అధికారులకు కూడా వచ్చాయి. ఫ్రెంచ్ రెఫరీ ఫ్రాంకోయిస్ లెటెక్సియర్‌కు 6,000కు పైగా వాట్సాప్ బెదిరింపులు వచ్చినట్లు సమాచారం.

## సెంచరీతో చెలరేగిన పడిక్కల్..! కానీ టీమిండియాలో బయటపడ్డ లోపాలు

**శ్రీలంక క్రికెట్ వార్మప్ మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ అద్భుత సెంచరీతో భారత ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. 14 ఫోర్లతో 121 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. యశస్వి జైస్వాల్ రెండు బంతుల్లోనే డకౌటవ్వగా, బౌలింగ్‌లో కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.**



శ్రీలంక క్రికెట్ ఎలెవన్‌తో కొలంబోలో జరుగుతున్న మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా పోరాడుతోంది. ఒకవైపు భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ రెండు బంతుల్లోనే డకౌటై నిరాశపరిచితే.. మరోవైపు యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుతమైన శతకంతో భారత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. కీలక సమయంలో క్రీజులో నిలిచిన పడిక్కల్ 14 ఫోర్లతో 121 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకుని తన సత్తా చాటాడు. మ్యాచ్ రెండో రోజు శ్రీలంక క్రికెట్ ఎలెవన్ 363/8 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం కేఎల్ రాహుల్‌తో కలిసి భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన జైస్వాల్.. కేవలం రెండు బంతులకే పెవిలియన్ చేరాడు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్ విశ్వ ఫెర్నాండో వేసిన రెండో బంతిని ఆఫ్‌స్టంప్‌కు దూరంగా వెళ్లి ఆడే ప్రయత్నంలో జైస్వాల్ గల్లీలో క్యాచ్ ఇచ్చాడు. బంతిని ఆడే సమయంలో సరైన ఫుట్‌వర్క్ లేకపోవడం అతని వికెట్‌కు కారణమైంది.

### కీలక సమయంలో పడిక్కల్ సెంచరీ

జైస్వాల్ వికెట్ తర్వాత భారత బ్యాటింగ్‌పై ఒత్తిడి పెరిగింది. అయితే దేవదత్ పడిక్కల్ బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేస్తూ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. భారత జట్టు 100 పరుగులు కూడా పూర్తి చేయకముందే కీలక వికెట్లు కోల్పోయే పరిస్థితిలో ఉండగా.. పడిక్కల్ తన సహజ శైలిలో ఆడుతూ పరుగులు రాబట్టాడు. 121 బంతుల్లో 14 ఫోర్లతో సెంచరీ పూర్తి చేసి భారత శిబిరంలో ఉత్సాహం నింపాడు. అతని స్థానంలో రిషభ్ పంత్ బ్యాటింగ్‌కు వచ్చాడు. అంతకుముందు శ్రీలంక క్రికెట్ ఎలెవన్ బ్యాటర్లను భారత బౌలర్లు పూర్తిగా కట్టడి చేయలేకపోయారు. అయితే చివరి సెషన్‌లో స్పిన్నర్లు పుంజుకోవడంతో ఆతిథ్య జట్టు పరుగుల వేగం కొంత తగ్గింది. కుల్దీప్ యాదవ్ 18 ఓవర్లలో 76 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. మానవ్ సుతార్ 11 ఓవర్లలో 30 పరుగులకు ఒక వికెట్ తీశాడు. రవీంద్ర జడేజా 15 ఓవర్లలో 64 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు సాధించాడు. జైస్వాల్‌కు లెఫ్ట్ ఆర్మ్ పేసర్లపై ఇబ్బందులు కొనసాగుతున్నాయనే చర్చ మరోసారి మొదలైంది. ముఖ్యంగా ఆఫ్‌స్టంప్‌కు దూరంగా వచ్చే బంతులను కట్ షాట్‌తో ఆడేందుకు ప్రయత్నించడం అతనికి ప్రతికూలంగా మారుతోంది. ఈ నేపథ్యంలో టీమిండియా కోచింగ్ బృందం అతని టెక్నిక్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తోంది.

## నీరజ్ బాటలో ఆశిష్.. వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో రజతం




భారత యువ జావెలిన్ త్రోయర్ ఆశిష్ యాదవ్ అంతర్జాతీయ వేదికపై సత్తా చాటాడు. అమెరికాలోని యూజీన్‌లో జరుగుతున్న వరల్డ్ అథ్లెటిక్స్ ఖ20 ఛాంపియన్‌షిప్స్ 2026లో పురుషుల జావెలిన్ త్రోలో రజత పతకం సాధించాడు. 19 ఏళ్ల ఆశిష్ 74.09 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచాడు. ఈ విజయంతో వరల్డ్ అథ్లెటిక్స్ ఖ20 ఛాంపియన్‌షిప్స్ జావెలిన్ విభాగంలో పతకం సాధించిన రెండో భారత అథ్లెట్‌గా ఆశిష్ నిలిచాడు. 2016లో నీరజ్ చోప్రా స్వర్ణం సాధించిన పదేళ్ల తర్వాత భారత్‌కు ఈ విభాగంలో మరో పతకం దక్కింది. దక్షిణాఫ్రికాకు చెందిన జాన్-హెంద్రిక్ హేమన్స్ 80.50 మీటర్లతో స్వర్ణ పతకం సాధించాడు. డొమినికాకు చెందిన అడిసన్ జేమ్స్ 73.89 మీటర్లతో కాంస్యం గెలుచుకున్నాడు. ఆశిష్ ఫైనల్లో తొలి ప్రయత్నంలో 69.96 మీటర్లు విసిరాడు. రెండో ప్రయత్నం ఫౌల్ కాగా, మూడో ప్రయత్నంలో 74.09 మీటర్లతో తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. ఆ తర్వాత 72.31, 70.62, 67.98 మీటర్ల దూరాలను నమోదు చేశాడు. ఆశిష్ ఈ ఏడాది పటియాలాలో జరిగిన ఇండియన్ ఓపెన్ త్రోస్ పోటీలో 74.49 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. యూజీన్ పోటీలకు ముందు అతని వ్యక్తిగత రికార్డు ఇదే.

# గ్లామర్ రోల్స్.. అసలు జాన్వీ ఒపీనియన్ ఏంటి?



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ టాలీవుడ్ లో వరుస అవకాశాలు అందుకుంటున్నప్పటికీ, ఆమె చేస్తున్న పాత్రలపై సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ సాగుతోంది. స్టార్ హీరోల సరసన నటిస్తున్నా, తన టాలెంట్ ను ప్రూవ్ చేసుకునే రేంజ్ లో రోల్స్ మాత్రం రావడం లేదని కొందరు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. రీసెంట్ గా రిలీజైన పెద్ది చిత్రంలో జాన్వీ పోషించిన అచ్చియమ్మ పాత్రపై మిక్స్ డ్ రెస్పాన్స్ వస్తోంది.

నిజానికి రామ్ చరణ్ తో ఆమె జోడీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు స్ట్రాంగ్ రోల్ ఇచ్చి ఉంటారని అభిమానులు భావించారు. అయితే సినిమా విడుదలైన తర్వాత, జాన్వీ పాత్రకు కథలో పెద్దగా ప్రాధాన్యం లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా ఆమెను ఎక్కువగా గ్లామర్ యాంగిల్ లోనే చూపించారని సోషల్ మీడియాలో పలువురు కామెంట్లు చేస్తున్నారు. ఇది మొదటిసారి కాదని నెటిజన్లు గుర్తు చేస్తున్నారు. టాలీవుడ్ లో ఆమె తొలి చిత్రం దేవరలోనూ జాన్వీ పాత్ర లిమిటెడ్ గా ఉందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. తంగం పాత్రలో కనిపించిన ఆమెకు కథలో చెప్పుకోదగ్గ స్కోప్ లేకపోవడం, కొన్ని సీన్స్, పాటలకు మాత్రమే పరిమితం కావడం అప్పట్లోనూ చర్చనీయాంశమైంది. దీంతో తెలుగులో ఇప్పటివరకు చేసిన రెండు సినిమాల్లోనూ యాక్టింగ్ కు అవకాశమున్న పాత్రలు దక్కలేదనే అభిప్రాయం ఫ్యాన్స్ లో వ్యక్తమవుతోంది. స్ట్రాంగ్ రోల్స్ దక్కితే ఆమెలోని అసలు టాలెంట్ బయట పడుతుందనే భావన వినిపిస్తోంది. అదే సమయంలో జాన్వీ కపూర్ కు సంబంధించిన ఓ పాత వీడియో సోషల్ మీడియాలో ఫుల్ గా వైరల్ అవుతోంది. ఆ వీడియోలో స్క్రీన్ పై తనను ఎలా ప్రెజెంట్ చేయాలనేది దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ దే నిర్ణయమని ఆమె చెప్పినట్లు కనిపిస్తోంది. "డైరెక్టర్ లేదా డీవోపీ కెమెరాను ఎలా ఉపయోగించాలనుకుంటారనేది వారిదే ప్లాన్. ఒక రోల్ లో ఎలా చూపించాలనేది కూడా వారి నిర్ణయమే" అనే ఆమె చెప్పినట్టు వీడియోలో వినిపిస్తోంది. అలాగే తనపై ఇప్పటికే గ్లామర్ డాల్ తరహా ఇమేజ్ ఏర్పడిందని, అందువల్ల చాలామంది మేకర్స్ కూడా అదే యాంగిల్ లో తనను చూపించాలని భావిస్తారని జాన్వీ పేర్కొన్నట్లు ఆ వీడియోలో ఉంది. అయితే ఒక నటిగా ప్రతి విషయంపై తాను నిర్ణయం తీసుకునే స్థితిలో ఉండనని, క్యారెక్టరైజేషన్ లో మేకర్స్ ఆలోచనే మెయిన్ గా వర్క్ చేస్తుందంటూ ఆమె చేసిన కామెంట్స్ మళ్లీ చర్చకు దారితీశాయి. ఏదేమైనా ఇప్పుడు జాన్వీ కామెంట్స్, ఆమె పోషించిన రోల్స్ రెండూ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. కోట్ల రూపాయల రెమ్యూనరేషన్ అందుకునే స్టార్ హీరోయిన్ అయినప్పటికీ, రోల్ విషయంలో తుది నిర్ణయం దర్శకులదేనంటూ ఆమె చేసిన కామెంట్స్ ను పలువురు నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. కానీ కేవలం గ్లామర్ కు మాత్రమే పరిమితం చేయకుండా కథలో ఇంపార్టెన్స్ ఉన్న పాత్రలు ఇస్తే జాన్వీ నటిగా మరింత గుర్తింపు తెచ్చుకునే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం త్రోబ్యాక్ వీడియోతో పాటు ఆమె జర్నీపై జోరుగా సోషల్ మీడియాలో చర్చ కొనసాగుతోంది.

# డిజిటల్ రంగంలో ఫరాఖాన్ సరికొత్త రికార్డు!



బాలీవుడ్ లో దర్శకురాలిగా, కొరియోగ్రాఫర్‌గా తనదైన ముద్ర వేసిన ఫరా ఖాన్ ప్రస్తుతం డిజిటల్ ప్రపంచంలోనూ సరికొత్త సంచలనాలు సృష్టిస్తున్నారు. సినిమా మేకింగ్‌తో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ యూట్యూబ్‌లో ఆమె చేస్తున్న సరికొత్త ప్రయోగాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సెలబ్రిటీలతో ఆమె చేసే వ్లాగ్స్ మిలియన్ల కొద్దీ వ్యూస్ సాధిస్తున్నాయి. ఫరాఖాన్ డిజిటల్ ప్రయాణంలో సరికొత్త మైలురాళ్లను అధిగమించడానికి రెడీ అవుతున్నారు. ఈనేపథ్యంలో తాజాగా యువ హీరో వరుణ్ ధావన్.. ఫరా ఖాన్ యూట్యూబ్ ప్రయాణంపై చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం దేశంలోనే అత్యధికంగా సంపాదిస్తున్న యూట్యూబర్‌గా ఫరా ఖాన్ రికార్డు సృష్టించిందంటూ వరుణ్ ధావన్ సరదాగా వ్యాఖ్యానించారు. సినిమా రంగంలోనే కాకుండా ఇలా డిజిటల్ కంటెంట్ క్రియేషన్‌లోనూ ఆమె నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకోవడం ఆమెలోని మల్టీటాస్కింగ్ నైపుణ్యానికి నిదర్శనమని బాలీవుడ్ వర్గాలు సైతం చర్చించుకుంటున్నాయి. ఫరా ఖాన్ తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా సాధిస్తున్న ఈ భారీ విజయానికి సంతోషంగా తన సహచర నటీనటులకు - చిత్ర బృందానికి అద్భుతమైన కానుకలను అందజేస్తూ వార్తల్లో నిలిచారు. తన కంటెంట్‌లో భాగమైన ప్రముఖులకు లక్షల రూపాయల విలువైన లగ్జరీ వాచీలు, డైమండ్ ఆభరణాలను బహుమతులుగా అందించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ విధమైన ఖరీదైన కానుకలను ఇవ్వడం ఆమె ఉదార స్వభావాన్ని చాటడమే కాకుండా తోటి నటీనటులతో ఆమెకున్న బలమైన అనుబంధాన్ని తెలియజేస్తోంది. ఈ పరిణామం బాలీవుడ్‌లో మారుతున్న వినోద రంగ సమీకరణాలను స్పష్టం చేస్తోంది. ఒకప్పుడు వెండితెరకే పరిమితమైన స్టార్ దర్శకులు , నటీనటులు ఇప్పుడు యూట్యూబ్ ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను ప్రధాన వేదికలుగా మార్చుకుంటున్నారు. ఫరా ఖాన్ వంటి సీనియర్ టెక్నీషియన్లు కాలానుగుణంగా మారుతూ యువతకు నచ్చే రీతిలో ఫన్నీ .. ఇంట్రెస్టింగ్ కంటెంట్‌ను జనరేట్ చేయడం ద్వారా డిజిటల్ మార్కెట్లో తిరుగులేని ఆదాయాన్ని .. క్రేజ్‌ను సొంతం చేసుకోగలుగుతున్నారు. యూట్యూబ్ కంటెంట్ క్రియేషన్‌లో సరికొత్త ట్రెండ్స్ సెట్ చేయడం అంత సులువు కాదు. అయితే ఫరా ఖాన్ తన సెలబ్రిటీ నెట్‌వర్క్‌ను ..తనలోని సహజసిద్ధమైన హ్యూమర్‌ను ఉపయోగించి విభిన్నమైన వ్లాగ్స్ రూపొందిస్తున్నారు. ౘాశ్రీంశీ =ఘుఽ - నైజాంలో తొలి రెండు రోజులు.. 'పెద్ది' సంగతేంటి? బాలీవుడ్ టాప్ స్టార్ల పర్సనల్ లైఫ్, షూటింగ్ లొకేషన్ విశేషాలు .. సరదా ఇంటర్వ్యూలను తన ఛానెల్‌లో ప్రసారం చేస్తుండటంతో వీక్షకుల సంఖ్య రోజురోజుకూ ఊహించని స్థాయిలో పెరుగుతోంది. ప్రతిభకు - కాలానుగుణంగా మారే ఆలోచనా విధానానికి వయసుతో సంబంధం లేదని ఫరా ఖాన్ నిరూపించారు. యూట్యూబ్ వేదికగా ఆమె సాధిస్తున్న ఆర్థిక విజయం, తోటి నటీనటులకు ఆమె ఇస్తున్న లగ్జరీ గిఫ్ట్స్ డిజిటల్ మీడియా అనంతమైన శక్తిని ప్రతిబింబిస్తున్నాయి. రాబోయే రోజుల్లో మరింత మంది మెయిన్‌స్ట్రీమ్ సినిమా సెలబ్రిటీలు పూర్తిస్థాయి కంటెంట్ క్రియేటర్లుగా మారడానికి ఈ విజయం రోల్ మోడల్‌గా నిలుస్తుందనడంలో సందేహం లేదు.



# చరణ్ 'పెద్ది' లెక్కలు..పవన్, బన్నీ, తారక్ రికార్డులు బ్రేక్..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కించిన పెద్ది మూవీ బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.135.36 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి దూసుకుపోతోంది. ఇప్పుడు రెండో రోజు కూడా అదే స్పీడ్ ను కంటిన్యూ చేస్తూ పలు రికార్డులను బ్రేక్ చేసినట్లు సమాచారం. ముఖ్యంగా కోస్తాంధ్రలోని ఆరు మెయిన్ ఏరియాల్లో పెద్ది రెండో రోజు వసూళ్లు ఇటీవల విడుదలైన పలువురు స్టార్ హీరోల సినిమాల కంటే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప-2, యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ దేవర చిత్రాల రెండో రోజు వసూళ్లను పెద్ది బ్రేక్ చేసినట్లు ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. ఇంకో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, కోస్తాంధ్రలో పెద్ది సినిమా లెక్కలు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ మూవీ రేంజ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో చరణ్ కెరీర్ లోనే కాకుండా ఇటీవలి కాలంలో విడుదలైన భారీ చిత్రాల లిస్ట్ లో పెద్ది సినిమా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించు కుంటోందని అభిప్రాయాలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. అ విజయానికి సినిమా బ్యాక్ డ్రాప్ కూడా ఒక మెయిన్ రీజన్ గా కనిపిస్తోంది. ఎందుకంటే పెద్ది కథ 1980ల నాటి కోస్తాంధ్ర విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగుతుంది. ఆ ప్రాంత కల్చర్, లైఫ్ స్టైల్, లోకల్ ఎమోషన్స్ ను బుచ్చిబాబు స్క్రీన్ పై చూపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా కోస్తాంధ్ర ప్రేక్షకులు సినిమాతో మరింతగా కనెక్ట్ కావడానికి ఇదే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సినిమాలో రామ్ చరణ్ పెద్ది పెహల్వాన్ పాత్రలో కనిపించగా, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ అచ్చియమ్మగా నటించారు. కన్నడ స్టార్ శివ రాజ్ కుమార్ గౌర్నాయుడు పాత్రలో కీలకంగా కనిపించారు. అలాగే దివ్యేందు శర్మ, జగపతి బాబు, బొమన్ ఇరానీ, వీజీ చంద్రశేఖర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. స్పెషల్ సాంగ్ లో స్టార్ హీరోయిన్ శ్రుతి హాసన్ ఆకట్టుకున్నారు. కథ విషయానికి వస్తే.. తన గ్రామానికి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో జీవించే ఓ సాధారణ యువకుడు కుస్తీ పోటీల ద్వారా ఎలా ఎదిగాడు? ఆ ప్రయాణంలో ఎదురైన సవాళ్లను ఎలా అధిగమించాడు? అన్న అంశాల చుట్టూ కథ తిరుగుతుంది. స్పోర్ట్స్, యాక్షన్, ఎమోషన్స్ ను మిక్స్ తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఏదేమైనా భారీ ఓపెనింగ్స్ తర్వాత రెండో రోజు కోస్తాంధ్రలో రికార్డు స్థాయి వసూళ్లు సాధించిన పెద్ది బాక్సాఫీస్ వద్ద జోరు కొనసాగిస్తోంది. ముఖ్యంగా అదే ప్రాంత నేపథ్యంతో తెరకెక్కిన ఆ చిత్రం అక్కడ ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ పొందడం హాట్ టాపిక్ గా మారింది.

# మృణాల్.. ప్లాన్ మార్చాల్సిందేనా?



టీవీ యాక్ట్రెస్ గా కెరీర్ ప్రారంభించి, ప్రస్తుతం బాలీవుడ్ తోపాటు టాలీవుడ్ లోనూ స్టార్ హీరోయిన్ గా గుర్తింపు పొందిన మృణాల్ ఠాకూర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారారు. అందానికి, అభినయానికి ఈక్వెల్ ఇంపార్టెన్స్ ఇస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె.. ఇప్పుడు సినిమాల సెలెక్షన్ విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే మృణాల్ 2014లో మరాఠీ చిత్రం విట్టి దండుతో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. అనంతరం 2018లో విడుదలైన లవ్ సోనియా చిత్రంలో ప్రధాన పాత్ర పోషించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఆ తర్వాత సూపర్ 30, బాట్లా హౌస్, తూఫాన్, జెర్సీ, ధమాకా, పిప్పా వంటి చిత్రాలతో బాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కానీ మృణాల్ కు అసలైన స్టార్ డమ్ ను తీసుకొచ్చింది టాలీవుడ్ నే అని చెప్పాలి. 2022లో విడుదలైన సీతారామంలో సీతామహాలక్ష్మి పాత్రలో ఆమె యాక్టింగ్ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. ఆ చిత్రం భారీ విజయాన్ని సాధించడంతో తెలుగు ప్రేక్షకులకు మృణాల్ ఎంతో దగ్గరయ్యారు. అనంతరం నాని హీరోగా వచ్చిన హాయ్ నాన్నలో కూడా తన పాత్రలో మెప్పించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఆ రెండు చిత్రాల విజయాలతో మృణాల్ పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. కథకు ప్రాధాన్యం ఉన్న సినిమాలు చేస్తారనే అభిప్రాయం కూడా బలపడింది. అయితే ఆ తర్వాత వచ్చిన కొన్ని ప్రాజెక్టులు మాత్రం ఆ స్థాయి ప్రభావం చూపలేకపోయాయి. ముఖ్యంగా ఫ్యామిలీ స్టార్ సహా పలు సినిమాలు ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయింది. అయినప్పటికీ మృణాల్ కు అవకాశాలు మాత్రం తగ్గలేదు. ఇటీవల వరుణ్ ధావన్, పూజా హెగ్డేతో కలిసి నటించిన హై జవానీ తో ఇష్క్ హోనా హై విడుదలైంది. ఆ చిత్రంలో మృణాల్ స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్, నటనకు మంచి మార్కులు వచ్చినప్పటికీ సినిమా కథ విషయంలో మిక్స్ డ్ రెస్పాన్స్ వస్తోంది. ఓల్డేజ్ కామెడీ, వీక్ స్టోరీ కారణంగా సినిమా ప్రేక్షకులను పూర్తిగా ఆకట్టుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రస్తుతం మృణాల్ సినిమా సెలెక్షన్ పై చర్చ మొదలైంది. నటిగా ఆమె టాలెంట్ పై ఎలాంటి డౌట్స్ లేవని, కానీ సరైన కథలు ఎంచుకోవడం మాత్రం చాలా కీలకమని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం హీరోయిన్ల మధ్య పోటీ ఉన్న సమయంలో కేవలం స్టార్ హీరోలు లేదా భారీ నిర్మాణ సంస్థలపై ఆధారపడకుండా, కంటెంట్ ను కూడా పరిశీలించాలని సూచిస్తున్నారు.



# స్వర్గానికి దారి చూపిస్తానంటున్న దివి.. జిమ్ అవుట్ ఫిట్ తో సెగలు పుట్టిస్తూ!



బుల్లితెర అయినా.. వెండితెర అయినా.. అందంతో ఆకట్టుకోవడానికి సెలబ్రిటీలు ఎప్పుడూ ముందుంటారు. అలా నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ వలకబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. మరి కొంతమంది కట్టు బొట్టుతో సాంప్రదాయంగా కనిపిస్తూ అభిమానులను రెచ్చగొడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా మరొక బ్యూటీ స్వర్గానికి దారి చూపిస్తానంటూ అందాలతో అదరగొట్టే ప్రయత్నం చేసింది. ఆమె ఎవరో కాదు అందాల తార, అభినయ సుందరి దివి. జిమ్ అవుట్ ఫిట్ లో సెగలు పుట్టించిన దివి.. ఒకవైపు గ్లామర్ తో కట్టిపడేస్తూనే.. మరొకవైపు సాంప్రదాయంగా కనిపిస్తూ తెలుగు కుర్రాల హృదయాలను దోచుకుంటోంది ఈ చిన్నది . ఈసారి కాస్త భిన్నంగా జిమ్ సెంటర్ నుండి సెగలు పుట్టిస్తూ.. జిమ్ ఔట్ఫిట్ లో కొన్ని ఫోటోలు షేర్ చేయడమే కాకుండా స్వర్గానికి దారి చూపిస్తా నాతో వచ్చేయ్ అంటూ క్యాప్షన్ జోడించి, అందరిని ఆకట్టుకుంది. ఇక తాజాగా జిమ్ సెంటర్ నుండి కొన్ని ఫోటోలు షేర్ చేసిన దివి.. అందులో జిమ్ అవుట్ ఫిట్ ధరించి మెస్మరైజ్ చేసింది. ఒకవైపు కష్టపడుతూ బరువులు మోసేస్తూ.. మరొకవైపు తన అందాలతో గిలిగింతలు పెట్టింది. ఓవరాల్గా ఈ జిమ్ అవుట్ ఫిట్ లో అమ్మడి అందానికి సోషల్ మీడియాలో మంటలు రాజుకుంటున్నాయి. ౘాశ్రీంశీ =ఘుఽ - డిజిటల్ రంగంలో ఫరాఖాన్ సరికొత్త రికార్డు! ౘాఽజవతీఅంవవవత్ దివి సినీ ప్రస్థానం.. 1996 మార్చి 15న హైదరాబాదులో శశికాంత్ వైద్య, దేవకీ దంపతులకు జన్మించిన ఈమె.. పదవ తరగతి వరకు జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్లో తన స్కూల్ విద్యాభ్యాసాన్ని పూర్తి చేసింది. ఆ తర్వాత జి.నారాయణమ్మ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఎంబీఏ పూర్తి చేసిన ఈమె.. 2017లో మోడలింగ్ రంగంతో తన కెరీర్ ను ఆరంభించింది. అలా పలు ఫ్యాషన్ సంస్థలకు మోడలింగ్ కూడా చేసింది. అలా మోడల్ గా పనిచేస్తున్న సమయంలో 2018లో లెట్స్ గో అనే షార్ట్ ఫిలిమ్ ద్వారా నటిగా అవకాశం అందుకున్న ఈమెకు.. 2019లో వచ్చిన మహర్షి సినిమా నటిగా ప్రాణం పోసింది. అలా ఈ సినిమాతో తన నటనతో ప్రూవ్ చేసుకున్న దివి 2019లో ఏ వన్ ఎక్స్ప్రెస్ , 2021లో క్యాబ్ స్టోరీస్ వంటి చిత్రాలతో తన ఉనికిని చాటుకుంది. దివి బిగ్ బాస్ ప్రయాణం.. అలా సినిమాలలో చిన్న చిన్న పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న సమయంలోనే బిగ్ బాస్ తెలుగు సీజన్ 4లో అవకాశం లభించింది. అయితే హౌస్ లోకి వచ్చిన ఈమె 49 రోజుల పాటు హౌస్ లో కొనసాగి, ఆ తర్వాత హౌస్ నుండి బయటకు వచ్చేసింది. ఇక బిగ్ బాస్ తో వచ్చిన గుర్తింపును ఉపయోగించుకొని.. రుద్రంగి, గాడ్ ఫాదర్ , జిన్నా, నయీమ్ డైరీస్, లంబసింగి , సింబ వంటి చిత్రాలలో నటించింది. పుష్ప 2 లో రిపోర్టర్ గా పనిచేసిన ఈమె 2025లో చివరిగా డాకు మహారాజ్ సినిమాలో ఝాన్సీ పాత్రతో అదరగొట్టేసింది. ఇప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఇలా గ్లామర్ వలకబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది ఈ ముద్దుగుమ్మ.

PRINTED, PUBLISHED &" and OWNER By:KASHAMOLLAVIJAYKUMAR," And Published At 5-234, RAMANDIR ROAD, PATANCHERU, SANGAREDDY, TELANGANA-502319 And PRINTED at M/S LASRITHASAI PUBLICATION DOOR NO.: 2-369-1, REVENUE WARD NO: 02, EEDGAROAD, NEAR RTC BUS STAND, PENUKONDA(TOWN & POST), PENUKONDAMANDAL, ANANTHAPUR, ANDHRAPRADESH-515110., "Email ID," Kashamollavijaykumar@gmailcom " Editor & Pro KASHAMOLLA VIJAYKUMARR.N.I. NO: TGTEL/26/A5230 MOBILE NUMBER: 9912159120